# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 8

గురువారం, 13 జూన్, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## రాష్ట్రమంతటా విస్తరించిన నైరుతి

**వారం రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న సాధారణ వర్షాలు**


**ఈనెల మూడో వారం నుంచి భారీ వర్షాలు**

**హైదరాబాద్:** నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించాయి. ఈ నెల 3న రాష్ట్రంలోకి ప్రవేశించిన రుతుపవనాలు క్రమంగా వ్యాప్తి చెందుతూ వారం రోజుల వ్యవధిలో రాష్ట్రమంతటా వేగంగా విస్తరించినట్లు వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. రుతుపవనాల వ్యాప్తి సమయంలోనే రాష్ట్రంలో తొలకరి వర్షాలు కురిశాయి. రాష్ట్రంలో గత పదిరోజుల్లో సంతృప్తికర స్థాయిలో వర్షపాతం నమోదైంది. నైరుతి సీజన్లో ఈనెల 12 నాటికి - 2వ పేజీలో

## కాళేశ్వరం బరాజ్‌లను వేగంగా పూర్తి చేయాలని

# గత ప్రభుత్వం ఒత్తిడి చేసింది

- బుధవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో విచారణ జరిపిన కమిషన్
- నిర్మాణ సంస్థల ప్రతినిధులు, హైడ్రాలజీ, డిజైన్స్ విభాగాల ఇంజనీర్లు హాజరు
- డిజైన్ల తయారీ, మార్పులు, నీటి లభ్యత తదితర అంశాలపై ప్రశ్నించిన కమిషన్
- సమాధానాలన్నీ అఫిడవిట్ రూపంలో అందజేయాలని అందరికీ ఆదేశం
- నేడు నిపుణుల కమిటీ సభ్యులను ప్రశ్నించేందుకు ఏర్పాట్లు
- విజిలెన్స్, కాగ్ అధికారులను కూడా ప్రశ్నిస్తాం: జస్టిస్ చంద్రఘోష్
- జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు తెలిపిన నిర్మాణ సంస్థలు



**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణ పనులను నిర్ణీత గడువు (టైమ్ బౌండ్)లోగా పూర్తి చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒత్తిడి చేసిందని జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలోని విచారణ కమిషన్‌కు బరాజ్‌ల నిర్మాణ సంస్థలు తెలిపాయి. పనులు సత్వరంగా పూర్తి చేయాలంటూ పరుగులు పెట్టించిందని పేర్కొన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి బరాజ్‌లను అప్పగించామని వివరించాయి. ఈ అంశాలను నెలాఖరు లోగా అఫిడవిట్ రూపంలో సమర్పించాలని నిర్మాణ సంస్థలను జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఆదేశించారు. కాళేశ్వ రం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై న్యాయవిచారణ లో భాగంగా బుధవారం బీఆర్ కేఆర్ భవన్‌లోని కార్యాలయం లో నిర్మాణ సంస్థల ఉన్నతాధికా రులను ఆయన ప్రశ్నించారు. మేడిగడ్డ బరాజ్ నిర్మాణ సంస్థ 'ఎల్అండ్‌టీ' తరఫున ఉపాధ్యక్షులు ఎంవీ కృష్ణరాజు, సురేశ్‌కు మార్, సీనియర్ డీజీఎం రంజీష్ చౌహాన్, అన్నారం బరాజ్ నిర్మాణ సంస్థ 'అఫ్కాన్స్-విజేత జేవీ' తరఫున హైడ్రో ప్రాజెక్టుల విభాగాధిపతి కె.మల్లికార్జునరావు, జీఎం శేఖర్‌దాస్, సుందిళ్ల బరాజ్ నిర్మాణ సంస్థ 'నవయుగ' తరఫున డైరెక్టర్ రామేశ్ యెద్దూరి, ప్రాజెక్టు మేనేజర్ కె.ఈశ్వర్‌రావు, జీఎం సి.మాధవ్ హాజరై సమాధానాలు ఇచ్చారు.

### ఆదేశించిన వారినీ పిలిచి విచారిస్తాం: జస్టిస్ చంద్రఘోష్

బ్యారేజీల డిజైన్లు, నిర్మాణం, నిర్వహణలో లోపం ఎక్కడ జరిగింది? ఎవరు చేశారో తేలుస్తామని జస్టిస్ చంద్రఘోష్ వెల్లడించారు. నిర్మాణ సంస్థల ప్రతినిధులను ప్రశ్నించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎవరి ఆదేశాలతో బరాజ్‌ల నిర్మాణ పనులు జరిగాయో రికార్డు రూపంలో సమాచారం అందిన తర్వాత వారిని సైతం విచారణకు పిలుస్తామన్నారు. నీటిపారు దల శాఖ ఇంజనీర్లు, నిర్మాణ సంస్థలు సమర్పించిన అఫిడవిట్లను పరిశీలించాక అవసరమైన వారిని మళ్లీ పిలిపించి విచారిస్తామని తెలిపారు. క్షేత్రస్థాయిలోని వాస్తవాలను తెలుసుకోవడానికే అఫిడవిట్లను దాఖలు చేయాలని కోరినట్టు చెప్పారు. బరాజ్‌ల డిజైన్లు, నిర్మాణం, నిర్వహణపై సమగ్ర వివరాలు అఫిడవిట్లలో ఉండాలని నిర్మాణ సంస్థలను కోరినట్టు తెలిపారు. ఎలాంటి సమాచారమైనా అఫిడవిట్ రూపంలో దాఖలు చేస్తేనే కమిషన్ స్వీకరిస్తుందన్నారు. తప్పుడు సమాచారంతో అఫిడవిట్లు దాఖలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్, కాగ్ నివేదికలు అందాయని.. వాటిని పరిశీలిస్తున్నామని తెలిపారు. న్యాయ విచారణలో భాగంగా విజిలెన్స్, కాగ్ అధికారులను సైతం ప్రశ్నిస్తామన్నారు.

### నేడు నిపుణుల కమిటీ సభ్యుల విచారణ

జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గురువారం నీటిపారుదల శాఖలోని హైడ్రాలజీ విభాగం ఇంజనీర్లతోపాటు కమిషన్‌కు సహకరించేందుకు ఏర్పాటైన నిపుణుల కమిటీ సభ్యులను విచారించనుంది. నిపుణుల కమిటీలో ఎన్ఐటీ వరంగల్ రిటైర్డ్ ప్రొఫెసర్ సీబీ కామేశ్వర్‌రావు, రిటైర్డ్ సీఈ కె.సత్యనారాయణ, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ ఎన్.రమణమూర్తి, ఉస్మానియా వర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం హెచ్ఓడీ పి.రాజశేఖర్, రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ ఉన్నారు. నిపుణుల కమిటీ ఇప్పటికే బరాజ్‌లకు చేసిన తనిఖీ నివేదికను కమిషన్‌కు సమర్పించింది.



## రుణమాఫీపై వారంలో కేబినెట్

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం
- విధివిధానాలు ఖరారు చేయనున్న ప్రభుత్వం
- ఆగస్టు 15లోగా రుణమాఫీకి కసరత్తు

**హైదరాబాద్:** రైతు రుణమాఫీ అమలు చేసే దిశగా ప్రభుత్వం కార్యాచరణను ముమ్మరం చేసింది. ఆగస్టు 15వ తేదీ లోగా రైతులకు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రుణ మాఫీపై చర్చించేందుకు, విధివిధానాలు ఖరారు చేసేందుకు వారం రోజుల్లో రాష్ట్ర కేబినెట్ సమావేశం నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసేందుకు అవసరమైన ప్రభుత్వ పరమైన నిర్ణయాలపై ఈ సమావేశంలో చర్చిస్తారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం గడువులోగా రుణమాఫీకి సన్నాహాలు చేయాలని ఇటీవల ముఖ్యమంత్రి.. వ్యవసాయ, ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రుణమాఫీకి ఎన్ని నిధులు అవసరం, దానికి తగ్గట్లుగా నిధుల సమీకరణకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలు, అందుబాటులో ఉన్న వనరులను పరిశీలిస్తున్నారు.

### కటాఫ్ తేదీ ఏది?

మరోవైపు రుణమాఫీ అమలుకు ఏ తేదీని కటాఫ్‌గా తీసుకోవాలి, అర్హులైన రైతులందరికీ లబ్ధి చేకూరేలా విధివిధానాలు ఎలా ఉండాలనే దానిపై ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. గతంలో జరిగిన రుణమాఫీ అమలు తీరును పరిశీలించటంతో పాటు ఇతర రాష్ట్రాల్లో రుణమాఫీ పథకాలు, వాటి అమలుకు అనుసరించిన పద్ధతిని సంబంధిత - 2వ పేజీలో

హైదరాబాద్ మోష్ పబ్‌లో మోసం చేసి..

## నాగ్‌పూర్‌లో చిక్కిన నయా ముఠా

**హైదరాబాద్:** డేటింగ్ యాప్‌లతో అమ్మాయిలను ఎరగా వేసి కస్టమర్ల నుంచి అధిక బిల్లులు వసూలు చేసిన ముఠాను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను మాదాపూర్ డీసీపీ వినీత్ మీడియాకు వెల్లడించారు. మోష్ పబ్ ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ మోసాన్ని ఛేదించినట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు పరారైన ఈ ముఠాను స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

"ఢిల్లీ నుంచి వచ్చిన ఆరుగురు వ్యక్తులు ఓ ముఠాగా ఏర్పడ్డారు. నిరుద్యోగ యువతులను గ్రూప్‌లో చేర్చుకొని వారి పేర్లు మార్చి డేటింగ్ యాప్స్/సైట్స్‌లో ఫొటోలు పెట్టి చాట్ చేయిస్తారు. అబ్బాయిలను ట్రాప్ చేసి దగ్గర్లోని పబ్‌కి తీసుకెళ్తారు. వీరికి ఆయా పబ్‌లలో ప్రత్యేక క్యూఆర్ కోడ్ మెషిన్, సర్వ్ చేసే వాళ్లు ఉంటారు. డెవిల్స్ నైట్ పేరుతో సపరేట్ మెనూను యువతితో పాటు వచ్చిన కస్టమర్‌కి ఇస్తారు. బిల్లింగ్ సమయానికి యువతి అక్కడి నుంచి ఉడాయిస్తుంది. ఆ తర్వాత అధిక బిల్లు వేసి కస్టమర్ నుంచి డబ్బులు వసూలు చేస్తారు. ఆ మొత్తాన్ని ఈ గ్రూప్, యువతి, పబ్ నిర్వాహకులు పంచుకుంటారు. నెల రోజుల తర్వాత మరో ప్రాంతానికి వెళ్లిపోతారు. ఇలా.. 40 రోజుల్లో రూ.40లక్షల వరకు మోసం చేశారు. హైదరాబాద్ నుంచి పారిపోయి నాగ్‌పూర్‌లో ఇదే విధంగా మోసం చేయబోతుంటే పట్టుకున్నాం. ఈ ఆపరేషన్‌లో ముఠాలోని కీలక వ్యక్తులు తరుణ్, జగదీశ్, సాయి కుమార్ సహా ఏడుగురు నిందితుల్ని అరెస్టు చేశాం. 8 సెల్‌ఫోన్లు, కారును సీజ్ చేశాం"అని డీసీపీ వినీత్ తెలిపారు.

## కొలువుదీరిన కొత్త మంత్రివర్గం

### ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు

- ఉదయం 11.33 గంటలకు ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- మంత్రులుగా ప్రమాణం చేసిన పవన్ కల్యాణ్, లోకేశ్... మరో 22 మంది...
- హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులు
- చిరంజీవి, రజనీకాంత్ సహా పలువురు సినీ ప్రముఖులు హాజరు


**అమరావతి:** ఏపీలో నూతన మంత్రివర్గం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, మంత్రులుగా మరో 24 మంది బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. గన్నవరం ఐటీ పార్కు వద్ద కేసరపల్లిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముందుగా చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం పవన్ కల్యాణ్, నారా లోకేశ్ సహా టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్రమంత్రులు, రజనీకాంత్, చిరంజీవి సహా పలువురు సినీ స్టార్లు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రధాన - 2వ పేజీలో



## ధరణి పోర్టల్‌కు అర్జీల వెల్లువ

- 3 నెలల్లో లక్ష దరఖాస్తులు
- కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు పెండింగ్‌లో 2.45 లక్షల దరఖాస్తులు
- మార్చిలో స్పెషల్ డ్రైవ్ పేరుతో 1.5 లక్షల అర్జీలకు పరిష్కారం
- లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిన డ్రైవ్
- అప్పట్నుంచి ఇప్పటివరకు మరో లక్ష దరఖాస్తులు
- రేపు కలెక్టర్లతో సీసీఎల్ఏ వీడియో కాన్ఫరెన్స్






**హైదరాబాద్:** తమ భూమికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధరణి పోర్టల్‌కు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వస్తున్నాయి. గత మూడు నెలల్లోనే లక్ష దరఖాస్తులు అందాయి. గతంలో పెండింగ్‌లో ఉన్న 2.45 లక్షల దరఖాస్తులను పరిష్కరించేందుకు ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లక్షల సంఖ్యలో దరఖాస్తులు పరిష్కరించినా, మళ్లీ ధరణి పోర్టల్‌లో దరఖాస్తుల సంఖ్య మొత్తం 2 లక్షలకు చేరినట్టు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి మూడో వారంలో ఎన్నికల కోడ్ అడ్డంకితో డ్రైవ్ ఆగిపోయినప్పటి నుంచి ఇటీవలి వరకు కొత్తగా లక్ష దరఖాస్తులు వచ్చాయని సమాచారం. ఈ నేపథ్యంలో ధరణి దరఖాస్తుల పరిష్కారం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పురోగతిని పరిశీలించడంతో పాటు ఈ దరఖాస్తుల పరిష్కారం కోసం తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్లకు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనుంది.

### ధరణి కమిటీ చొరవతో..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు 2.45 లక్షల ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కలెక్టర్ల పని ఒత్తిడికి తోడు పోర్టల్‌లోని సాంకేతిక కారణాలతో చాలా దరఖాస్తులు ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉండిపోయాయి. దీంతో ధరణి పోర్టల్‌ను సంస్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ చొరవతో ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి ఈ ఏడాది మార్చినెల మొదటి వారంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందుకోసం ప్రత్యేక మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే అదే నెలలో లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడంతో స్పెషల్ డ్రైవ్‌ను ప్రభుత్వం నిలిపివేసింది. సాధారణ ప్రక్రియలో భాగంగా అడపాదడపా పరిష్కరించిన కొన్ని దరఖాస్తులు కలిపి మొత్తం 1.5 లక్షల దరఖాస్తులను పరిష్కరించారు. ఇంకా మిగిలిన దాదాపు లక్ష దరఖాస్తులకు తోడు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ధరణి పోర్టల్‌కు వచ్చిన మరో లక్ష కలిపి ఇప్పుడు పెండింగ్ దరఖాస్తుల సంఖ్య మొత్తం 2 లక్షలకు చేరింది. ఈ నేపథ్యంలో సీసీఎల్ఏ మిత్తల్ శుక్రవారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విడతల వారీగా ఒక్కోసారి ఐదారు జిల్లాల కలెక్టర్లతో గంట పాటు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ధరణి పోర్టల్‌తో పాటు ప్రజావాణి, గ్రీవెన్స్ కార్యక్రమాల సందర్భంగా వచ్చిన దరఖాస్తులు, సీఎం కార్యాలయానికి నేరుగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించే విషయమై కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నారు.

## అక్టోబర్ 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్

**షెడ్యూల్ ప్రకటించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్**



**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 563 గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి సంబంధించి మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. అక్టోబర్ 21 నుంచి 27 వరకు వరుసగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఏడు పరీక్షలు వరుసగా హైదరాబాద్‌లో హెచ్ఎండీఏ పరిధిలో జరగనున్నాయి. ప్రతీ పరీక్షకు 3 గంటల సమయం ఉంటుందని, గరిష్ట మార్కులు 150 అని కమిషన్ వెల్లడించింది. జనరల్ ఇంగ్లిష్ పరీక్ష ప్రశ్నపత్రం మినహా మిగతావన్నీ ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ భాషల్లో ఉంటాయి. అభ్యర్థి ఇష్టానుసారంగా భాషను ఎంచుకుని జవాబులు రాయొచ్చు. కన్వెన్షనల్, డిస్క్రిప్టివ్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు కమిషన్ తెలిపింది. ఆరు పరీక్షలను ఎంపిక చేసుకున్న ఒకే భాషలో రాయాల్సి ఉంటుందని, - 2వ పేజీలో



## మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

**6 గ్యారంటీల్లో 5 అమలు చేశాం.. ఉద్యోగులకు 1న వేతనాలు ఇస్తున్నాం**

**చింతకాని వరకు పల్లెవెలుగులో ప్రయాణించిన భట్టి**

**ఉచిత కరెంట్, బస్ ప్రయాణంపై మహిళలతో ముచ్చటించిన డిప్యూటీ సీఎం**

**ఖమ్మం వన్‌టౌన్:** మహిళల ఆర్థిక స్వావలంబనే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ నుండి బుధవారం ఆయన పల్లెవెలుగు బస్సులో చింతకాని మండలం జగన్నాథపురం వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా సాధారణ ప్రయాణికుడిలానే టికెట్ తీసు కుని ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత కరెంట్, ఉచిత బస్సు ప్రయాణం లాంటి పథకాల అమలుపై మహిళలతో, జీరో టిక్కెట్ విధానం గురించి కండక్టర్ శైలజను అడిగి తెలుసుకున్నారు. నాగులవంచ గ్రామానికి చెందిన జానమ్మ, అనంతమ్మతో భట్టి మాట్లాడుతూ కరెంట్ మంచిగా - 2వ పేజీలో

వాయిస్ టుడే
జనగళం - మనగళం
హైదరాబాద్
గురువారం, 13 జూన్, 2024

# రుణమాఫీపై వారంలో కేబినెట్

మొదటి పేజీ తరువాయి

శాఖల అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలు, అనుసరిస్తున్న విధివిధానాలు, నిర్దేశించిన అర్హతలను కూడా పరిశీలిస్తున్నారు.

**కేంద్రం మాదిరి ఉద్యోగులు, డాక్టర్లు తదితరులకు మినహాయింపు?**

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకంలో భాగంగా దేశంలో అర్హులైన రైతులందరికీ ప్రతి ఏడాది రూ.6 వేలు ఆర్థిక సాయం అందిస్తోంది. రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జెడ్పీ చైర్మన్లు, రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్నవారు, కేంద్ర రాష్ట్ర ఉద్యోగులు, రూ.10 వేలకు మించి పెన్షన్ అందుకునే రిటైర్డ్ ఉద్యోగులు, ఐటీ పన్ను చెల్లించేవారు, డాక్టర్లు, ఇంజనీర్లు, సీఏ, ఆర్కిటెక్టులు లాంటి ప్రొఫెషనల్స్‌ను ఈ పథకం నుంచి మినహాయించింది. పీఎం కిసాన్ పథకానికి కేంద్రం అనుసరించిన మార్గదర్శకాలు అసలైన రైతులకు లబ్ధి చేకూర్చాయనే అభిప్రాయం ఉంది. ఈ మేరకు రుణమాఫీ అమలుకు ఎటువంటి మార్గదర్శకాలు పాటించాలి, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రతి రైతుకు మేలు జరిగేలా ఎలాంటి విధివిధానాలుండాలనేది రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

వస్తుందా...ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉంది? ఎన్నిసార్లు ఉచితంగా ఆర్టీసీలో ప్రయాణం చేశారని అడిగారు. అందుకు వారు సమాధానమిస్తూ ఉచిత బస్సుల్లో ప్రయాణం వల్ల ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందని తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు రుణాలు ఇప్పించి వారితో బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీలో పెట్టాలనే ఆలోచన చేస్తున్నామని భట్టి తెలిపారు. రాష్ట్రంలో 92% ఉన్న బలహీన వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వంలో ఆర్టీసీ ఉంటుందా, మూసివేస్తారా, అమ్ముతారా అన్న దశ నుంచి ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించడంతో పాటు సంస్థను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశామన్నారు. కాగా, గత పాలకులు రూ.7లక్షల కోట్లు అప్పులు చేస్తే ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని నెమ్మదిగా గాడిలో పెడుతున్నామన్నారు. డిప్యూటీ సీఎం భట్టి వెంట వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కలెక్టర్ వీపీ.గౌతమ్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వెంకన్న బస్సులో ప్రయాణించారు.

# అక్టోబర్ 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్

మొదటి పేజీ తరువాయి

ఒక్కో పరీక్షను ఒక్కో భాషలో రాసే అవకాశం లేదని పేర్కొంది. అలా రాసినట్లైతే వాటిని పరిగ ణనలోకి తీసుకోమని కమిషన్ స్పష్టంచే సింది. జనరల్ ఇంగ్లిష్ పరీక్ష పదోతరగతి స్థాయిలో ఉంటుంది. ఈ పరీక్షలో వచ్చిన మార్కులను ర్యాంకింగ్ పరిధిలోకి తీసు కోరు.. కానీ ఈ పరీక్షలో క్వాలిఫై అయితేనే ఇతర పరీక్షల పేపర్లను వాల్యుయేషన్ చేస్తారు. ఇందులో ఫెయిలైతే తక్కిన పేపర్లను పరి గణనలోకి తీసుకోరు. అభ్యర్థి నిర్దేశించిన అన్ని పరీక్షలకు తప్పకుండా హాజరు కావా లి. ఇందులో ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా వెంటనే అనర్హతకు గురవుతారు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన సిలబస్, విధానం తదితర పూర్తిస్థాయి సమా చారం కమిషన్ వెబ్‌సైట్‌లో ఉందని టీజీపీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ తెలిపారు.

**గ్రూప్%-%1 మెయిన్స్ పరీక్షల షెడ్యూల్ ఇదే...**

| సబ్జెక్టు | సమయం | మార్కులు | తేదీ |
|---|---|---|---|
| జనరల్ ఇంగ్లిష్ (క్వాలిఫయింగ్ టెస్ట్) | 3 గంటలు | 150 | 21.10.2024 |
| పేపర్-1, జనరల్ ఎస్సే | 3 గంటలు | 150 | 22.10.2024 |
| పేపర్-2, హిస్టరీ, కల్చర్, జియోగ్రఫీ | 3 గంటలు | 150 | 23.10.2024 |
| పేపర్-3, ఇండియన్ సొసైటీ, | 3 గంటలు | 150 | 24.10.2024 |
| కాన్‌స్టిట్యూషన్ అండ్ గవర్నెన్స్ | | | |
| పేపర్-4, ఎకానమీ, అండ్ డెవలప్‌మెంట్ | 3 గంటలు | 150 | 25.10.2024 |
| పేపర్-5, సైన్స్ అండ్ టెక్నాలజీ, | | | |
| డేటా ఇంటర్‌ప్రిటేషన్ | 3 గంటలు | 150 | 26.10.2024 |
| పేపర్-6, తెలంగాణ మూవ్‌మెంట్ | | | |
| అండ్ స్టేట్ ఫార్మేషన్ | 3 గంటలు | 150 | 27.10.2024 |

# రిటైనింగ్ వాల్ పనుల పరిశీలన

**ద్విచక్రవాహనంపైనే తిరుగుతూ పరిశీలించిన మంత్రి పొంగులేటి**



**ఖమ్మంమయూరిసెంటర్:** ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల పరిధిలోని మున్నేరు పరీవాహ క ప్రాంతంలో నిర్మిస్తున్న ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్ పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలోని దానవాయిగూడెం, ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లి ప్రాంతాల్లో ద్విచక్ర వాహనంపై పర్యటించిన ఆయన పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. నిర్మాణ పనులను త్వరగా నాణ్యతతో పూర్తి చేయాలని, జాప్యం చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాగా, మంత్రి పొంగులేటి తన పర్యటనకు సంబంధించిన ఫొటోలను, వీడియోలను ట్విట్టర్ ఖాతాలో షేర్ చేశారు.

# రాష్ట్రమంతటా విస్తరించిన నైరుతి

మొదటి పేజీ తరువాయి

3.81 సెం.మీ. సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా..6.01 సెం.మీ. నమోదైంది. సాధారణ వర్షపాతం కంటే 55% అధికంగా నమోదైంది. ప్రస్తుతం మోస్తరు వర్షాలే కురవగా..ఈనెల మూడో వారం నుంచి భారీ నుంచి అతిభారీ వర్షాలు సైతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావర ణ శాఖ నిపుణులు అంచనా వేశారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో సంతృప్తికరంగా, 4 జిల్లాల్లో మధ్యస్థంగా, 9 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా... ఆదిలాబాద్, మంచిర్యా ల. నిర్మల్, పెదపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

**రెండ్రోజులు పలుచోట్ల మోస్తరు వర్షాలు:** రాష్ట్రంలో రానున్న రెండు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావ రణ శాఖ వెల్లడించింది. ఆసిఫాబాద్, కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వివరించింది. రాష్ట్రానికి పశ్చిమ, వాయవ్య దిశల నుంచి తక్కువ ఎత్తులో బలమైన గాలులు వీస్తున్నట్లు తెలిపింది.



# కొలువుదీరిన కొత్త మంత్రివర్గం

మొదటి పేజీ తరువాయి

వేదికపై ప్రధాని మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు, చంద్రబాబు దంపతులు ఆశీనులయ్యా రు. వేదికకు ఎమడ వైపు కేంద్ర మంత్రులు, రాజకీయ, సినీ ప్రముఖులు కూర్చోగా, కుడివైపు ప్రమాణస్వీకారం చేసిన మంత్రులు కూర్చున్నారు. చంద్రబాబుతో ఉదయం 11.33 గంటల కు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయిం చారు. అనంతరం చంద్రబాబును వేదికపైనే ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆలింగనం చేసుకుని అభినందనలు తెలి పారు. ఆ తర్వాత కేంద్ర మంత్రులు, సినీ ప్రముఖుల వద్దకెళ్లి చంద్రబాబు నమస్కారం చేశారు. చంద్రబాబు తర్వాత జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రమాణం చేశారు. అనంతరం పవన్ ప్రధాని, చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలపడంతోపాటు తన సోదరుడు, మెగా స్టార్ చిరంజీవికి పాదాభివందనం చేశారు. ఆ తర్వాత వరుసగా నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, సత్యకుమార్, నిమ్మల రామానాయుడు, ఎన్ఎండీ ఫరూక్, ఆనం రామనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, డి. బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, గుమ్మడి సంధ్యారాణి, బీసీ జనార్ధన్‌రెడ్డి, టీజీ భరత్, ఎస్ సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి మంత్రులుగా ప్రమాణం చేశారు. చంద్రబాబు



సహా 24 మంది దైవ సాక్షిగా ప్రమాణం చేయగా, ఎన్ఎండీ ఫరూక్ అల్లా సాక్షిగా ప్రమాణం చేశారు.

ప్రమాణ స్వీకారం చేసేటప్పుడు పదాలను ఉచ్ఛరించడంలో ముగ్గురు మంత్రులు తడబడ్డారు. వాసంశెట్టి సుభాష్ తడబా టుకు లోనై కొన్ని పదాలు పలకలేకపోయారు. కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్ధన్‌రెడ్డి కూడా తడబాటుకు లోన య్యారు. ప్రమాణస్వీకారం తర్వాత చంద్రబాబు మంత్రివర్గ సభ్యులతో ప్రధాని మోదీ గ్రూప్ ఫొటో దిగారు. ఆ తర్వాత చంద్రబాబు ఆయన్ను ప్రత్యేకంగా సన్మానించి వేంకటేశ్వం స్వామి ప్రతిమను బహూకరించారు. అనంతరం పవన్ కళ్యాణ్ వేదికపై తన సోదరుడు ఉన్నారని చెప్పగా ప్రధాని మోదీ చిరంజీవి వద్దకు షేక్ హ్యాండ్ ఇచ్చి పలకరించారు. మోదీ, చిరంజీవి, పవన్ కళ్యాణ్ చేతులను పైకి లేపి సభి కులకు అభివాదం చేయడం విశేషం. చంద్రబాబు రజనీ కాంత్‌ను చూపించగా మోదీ ఆయనకు నమస్కరించి పలక రించారు. వేదికపై ఉన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ, ఇతర కేంద్ర మంత్రులకు మోదీ అభివాదం చేశారు. ప్రమాణం చేసిన తర్వాత పలువురు మంత్రులు తనకు పాదాభివందనం చేయబోతుండగా ప్రధాని వారించారు. కార్యక్రమం ముగిసిన వెంటనే ఆయన సమీపంలోని ఎయిర్‌పోర్టుకు వెళ్లి అక్కడి నుంచి ఒడిశాకు పయనమయ్యారు.

**హాజరైన ప్రముఖులు వీరే**

ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, జితన్ రామ్ మంజి, చిరాగ్ పాశ్వాన్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్ర సహాయ మంత్రులు జయంత్ చౌదరి, అనుప్రియా పాటిల్, రామ్‌దాస్ అథవాలే, రాజ్యసభ సభ్యుడు ప్రఫుల్ పటేల్, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై, తమిళనాడు మాజీ సీఎం పన్నీర్ సెల్వం తదితరులు కూడా హాజరయ్యారు.

# వామ్మో.. రూ.21.47 కోట్ల కరెంట్ బిల్లు..

**నాగర్‌కర్నూల్ జిల్లాలో**
**ఓ వ్యక్తికి వచ్చిన బిల్లు ఇది..**
**తర్వాత సరిచేసిన విద్యుత్ అధికారులు**

**బిజినేపల్లి:** గ్రామజ్యోతి పథకం కింద ప్రభుత్వం ఓ వైపు వినియోగదారులకు జీరో బిల్లు ఇస్తుంటే.. మరోవైపు నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ సాధారణ వ్యక్తికి విద్యుత్ సిబ్బంది రూ.కోట్లలో బిల్లు ఇచ్చి షాకిచ్చారు. సాధారణంగా ఓ వినియోగదారునికి కరెంట్ బిల్లు నెలకు రూ.500 వరకు వస్తుంది. ఏసీ, ఫ్రిడ్జ్, గీజర్ వంటి వస్తువులు వాడితే.. రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు వస్తుంది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం ఖానాపూర్‌కు చెందిన వేమారెడ్డికి ప్రతీ నెల రూ.వందల్లో బిల్లు వచ్చేది. ఈ క్రమంలో ఈ నెల 7న విద్యుత్ అధికారులు వేమారెడ్డి ఇంట్లో కరెంట్ మీటర్ స్కాన్ చేసి రూ.21,47,48,569 చెల్లించాల్సిందిగా బిల్లు ఇచ్చి వెళ్లారు. ఆలస్యంగా ఆ



బిల్లు చూసుకున్న వేమారెడ్డికి ఒక్కసారి షాక్ కొట్టిన ట్లు అయింది. తమకు సాధా రణంగా రూ.వందల్లో రావాల్సిన బిల్లు రూ.కోట్లలో రావడం ఏమిటని ఆందోళన చెందుతూ ఆయన విద్యుత్ శాఖ అధికారులను ఆశ్రయించారు. దీనిపై ఏఈ మహేశ్‌ను వివరణ కోరగా జీరో బిల్లు చేసే సమయంలో అలా వచ్చిందని.. తిరిగి రీఎంట్రీ చేయడం ద్వారా మళ్లీ సాధారణంగా వచ్చిందని తెలిపారు.

# స్థానిక సంస్థల బలోపేతంపై పరస్పర సహకారం

**తెలంగాణ, కర్ణాటక నిర్ణయం**

**హైదరాబాద్:** స్థానిక సంస్థల బలోపేతానికి పరస్పరం సహకరించుకునే విషయంపై దృష్టి సారించామని తెలంగాణ ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కర్ణాటక రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ నారాయణస్వామి వెల్లడించారు. తెలంగాణ స్థానిక సంస్థల పనితీరును పరిశీలించడంతో పాటు వాటి ఆర్థిక స్థితిగతులను తెలుసుకోవడానికి కర్ణాటక ఆర్థిక సంఘం బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఆర్థిక సంఘం కార్యాలయంలో బుధవారం రెండు రాష్ట్రాల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కర్ణాటకలోని స్థానిక సంస్థల పని తీరును వివరించడంతో పాటు ఆర్థిక పరిపుష్టికి తమ రాష్ట్రంలో తీసుకున్న నిర్ణయాలను నారాయణస్వామి వివరించారు. ఇతర రాష్ట్రాలలో పర్యటించి రెండు రాష్ట్రాల స్థానిక సంస్థల పని తీరును మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు.

# 'పత్తి విత్తనాల బ్లాక్ దందాలో మంత్రి హస్తం'

**సూర్యాపేట:** రాష్ట్రంలో పత్తి విత్తనాల కొర తలో ప్రభుత్వ పెద్దల పాత్ర ఉందని, పత్తి విత్తనాల బ్లాక్ దందా లో ఓ మంత్రి హస్తం కూడా ఉందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ఆరోపించారు. ఆధా



రాలు రాగానే పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడి స్తామన్నారు. జగదీష్ రెడ్డి బుధవారం సూర్యా పేటలో బుధవారం మీడియా తో మాట్లాడా రు. ప్రభుత్వం కొలువుదీరి 6నెలలైనా హామీల అమలు మరచి గత ప్రభుత్వాలపై నిందలు వేస్తూ కాంగ్రెస్ పబ్బం గడుపుతోందన్నా రు.ప్రభుత్వం చేతగానితనాన్ని కప్పిపుచ్చుకుంటూ కమిషన్ల ఏర్పాటు పేరుతో డ్రామాలు చేస్తోందని ఎద్దేవా చేశారు. ఎన్ని కమిషన్లు వేసినా ఎవరికీ లేదనీ, కానీ కమిషన్ల విచారణ పేరుతో రైతు రుణమాఫీపై దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందన్నారు.

# తెలంగాణపై చంద్రబాబు, రేవంత్ కుట్రలు బాల్క సుమన్

**హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు కనుసన్నల్లోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన నడిపిస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన పదేళ్ల తర్వాత రాష్ట్రంపై చంద్రబాబు, రేవంత్ కుట్రలు మొద లు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి బుధవారం తెలంగాణ భవన్‌లో బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. చంద్రబా బు సూచనల మేరకే నీటి పారుదల శాఖ సలహాదారుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆదిత్యనాథ్ దాస్‌ను రేవంత్ ప్రభుత్వం నియమించిందన్నారు. ఆదిత్యనాథ్ నియా మకాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**సివిల్ సప్లైస్ కుంభకోణంలో**
**రేవంత్: పెద్ది సుదర్శన్ రెడ్డి**

పౌర సరఫరాల శాఖ కుంభకోణంలో సీఎం రేవంత్ రెడ్డి పాత్ర ఉందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. అందుకే ఆ శాఖలో భారీ కుంభకోణం జరిగినా ప్రభుత్వం స్పందించడం లేదని, అక్రమాలకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో 'ఒలింపస్' ఆర్అండ్‌డీ కేంద్రం

**హెచ్‌సీఎల్ టెక్‌తో కలిసి ఏర్పాటు చేయనున్న అమెరికా సంస్థ**
**రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం.. మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి**

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్‌షోర్ సెంటర్‌ను నెలకొల్పేందుకు ఒలింపస్ కార్పొరేషన్ సంసిద్ధత వ్యక్తం చేసింది. హెచ్‌సీఎల్ టెక్‌తో కలిసి ఈ మేరకు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి డి. శ్రీధర్‌బాబు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒలింపస్ కార్పొరేషన్ గ్లోబల్ సీనియర్ ప్రెసిడెంట్ సయ్యద్ నవీద్‌తో సమావేశమయ్యారు. సమావేశంలో ఒలింపస్ కార్పొరేషన్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఆండ్రీ రాగన్, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద వైద్య పరికరాల తయారీ కంపెనీలలో ఒకటైన ఒలింపస్ కార్పొరేషన్ భారత్‌లో పెట్టుబడుల కోసం హైదరాబాద్ ను ఎంచుకొని ఆర్అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం సంతోషకరమన్నారు. మెడికల్ హబ్‌గా పేరున్న హైదరాబాద్‌లో ఒలింపస్ కార్పొరేషన్ తమ పరిశోధన కేంద్రాన్ని ఏర్పా టు చేసేందుకు అవసరమైన అన్ని మౌలిక సదు పాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ఈ కేంద్రం హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్‌తో కలిసి సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టులను నిర్వహిస్తుందని తెలిపారు. ఒలింపస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఆండ్రీ రోగన్ మాట్లాడుతూ హెచ్‌సీఎల్ టెక్‌తో కలిసి ఈ ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు.

# యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జయారెడ్డి

**హైదరాబాద్:** యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సంగారెడ్డి జిల్లాకు చెందిన టి.జయారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు యూత్‌కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బి.వి.శ్రీనివాస్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన యూత్ కాంగ్రెస్ నాయకురాలిగా ఆమె చేసిన



సేవలను గుర్తించి పదోన్నతి కల్పిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి కుమార్తె అయిన జయారెడ్డి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా జయారెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నెరవేరుస్తానని చెప్పారు.

# మెరుగైన సేవలు అందించాలి

**సిరిసిల్ల అర్బన్ బ్యాంకు పాలకవర్గానికి కేటీఆర్ సూచన**

**హైదరాబాద్:** నిరంతరం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని సిరిసిల్ల అర్బన్ బ్యాంకు పాలకవర్గ సభ్యులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సూచించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన అర్బన్ బ్యాంకు పాలకవర్గ సభ్యులు బుధవారం హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసంలో



మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళితో పాటు డైరెక్టర్లు, పాలకవర్గాన్ని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంకు అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని కేటీఆర్ అన్నారు.



## రేకొండలో శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర

### ఎల్లమ్మ తల్లికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

చిగురుమామిడి (వాయిస్ టుడే): గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరను కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో బుధవారం గౌడ సంఘం అధ్యక్షులు పాకాల రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడప నుండి మహిళలు బోనం ఎత్తుకొని డప్పు చప్పుళ్లు శివసత్తుల పూనకాల మధ్య పురవీధుల గుండా గ్రామ శివారులోని ఎల్లమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మ తల్లి బోనాలను సైతం నిర్వహించినట్లు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, గోడ్డు గోదా సల్లంగా ఉండాలని ఎల్లమ్మ తల్లిని వేడుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు చిగురుమామిడి మండల ప్రజలతో పాటు సైదాపూర్ మండలంలోని పలు గ్రామాల్లోని భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, చలువ పందిళ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. జాతర కోసం ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని విద్యుత్ బల్బులతో అందంగా అలంకరించారు. గౌడ కులస్తులమంతా ఐక్యతతో ఉంటూ భవిష్యత్తులో ఆలయాన్ని పునర్నిర్మిస్తామని అధ్యక్షుడు రమేష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొత్తూరు సంధ్యా రమేష్, సింగిల్ విండో డైరెక్టర్ చాడ శ్రీధర్ రెడ్డి, తాజామాజీ సర్పంచ్ పిట్టల రజిత శ్రీనివాస్, గౌడ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు పాకాల రమేష్ గౌడ్, ఉపాధ్యక్షుడు గోపగోని సత్యనారాయణ, కార్యదర్శి జున్నూరి రాములు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పరకాల కొండయ్య, సభ్యులు గోపగోని వెంకటయ్య, పడాల శ్రీనివాస్, ఏరుకొండ కుమార్, పడాల లస్మయ్య, సుధగోని రాజమల్లు, యూత్ అధ్యక్షులు జున్నూరి సదానందం, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా నాయకులు దుడ్డేల లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గాదేపాక సునీల్, ముంజ చంద్రయ్య, సాయి చరణ్, రంజిత్, రాజు, నరేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## షష్టి తిథిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

### నూతన ఆలయ నిర్మాణానికి సహకరించాలన్న కమిటీ సభ్యులు

చిగురుమామిడి (వాయిస్ టుడే): కోరిన కోరికలు తీర్చి కొంగుబంగారంగా వెలుగొందుతున్న కరీంనగర్ జిల్లా చిగురుమామిడి స్వయంభూ పాంబండ పంచముఖ ఆంజనేయ స్వామి వారి దివ్య క్షేత్రంలో షష్టి తిథి బుధవారం రోజున శ్రీశ్రీశ్రీ గురూజీ ఉమేష్ స్వామి చేతుల మీదుగా అత్యంత వైభవంగా శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల కోలాహలంతో ఆలయ ప్రాంగణమంతా భక్తి పారవశ్యంతో మర్మోగింది. నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు. హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెట్ పల్లి, జగిత్యా, సిద్దిపేట, హుస్నాబాద్, వరంగల్, మంచిర్యాల్, కోహెడ, ఎల్కతుర్తి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక హెరీమం కార్యక్రమం నిర్వహించుకొని స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు.



## రవీందర్ కుటుంబానికి 50 కేజీ బియ్యంతో పాటు 30 వేల నగదు అందజేత

### 1986 – 87 ఎస్ఎస్సి బ్యాచ్ అభినందిస్తున్న గ్రామస్తులు

చిగురుమామిడి (వాయిస్ టుడే) : ఆపదలో అండగా నిలుస్తూ, వారికి తోచిన సహాయం అందజేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న 1986 – 87 ఎస్ఎస్సి బ్యాచ్ ఇందుర్తి గ్రామంలో కొంతకాలంగా అనారోగ్యం బాధపడుతున్న దర్జీ మాడిశెట్టి రవీందర్ కుటుంబానికి 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు 30 వేల రూపాయల నగదు అందించినట్లు చెప్పారు. గ్రామస్తులు మిత్ర బృందాన్ని అభినందిస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని తమకు తోచిన విధంగా రవీందర్ వైద్య ఖర్చులకు ఎవరైనా సహాయ సహకారాలు అందించాలని పలువురు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కూన రాజేందర్, కంది రాజశేఖరరెడ్డి, చింతపూల విజయ్, కోమటి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బుర్ర కుమారస్వామి, గుండ శ్రీనివాస్, దుస్స శ్యామ్ సుందర్, చింతపుల రాజయ్య, కర్ర రాజయ్య, పోచయ్య, పాల్గొన్నారు.

## గో సంరక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి




రామకృష్ణాపూర్ జూన్ 12 (వాయిస్ టుడే) దేశి గోవంశ రక్షణ సంవర్ధన సమితి, మూగజీవాల సేవా సంఘం ఆధ్వర్యంలో గోవుల అక్రమ రవాణా అడ్డుకొని "అన్ బ్లాక్" చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని బుధవారం పట్టణ ఎస్సై రాజశేఖర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మూగజీవాల సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కటకం నాగరాజు, జిల్లా ప్రచార కార్యదర్శి వేముల హరిప్రసాద్, ఉపాధ్యక్షుడు మర్రి స్వామి, కోశాధికారి తిరుమల శెట్టి రమణ రావు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీటీసీ శ్రీరామ్ శ్యామ్ చేతులమీదుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నూతన దుస్తుల పంపిణీ



జమ్మికుంట జూన్ 12(వాయిస్ టుడే): జమ్మికుంట మండల పరిధిలోని వావిలాల ప్రభుత్వ సెకండరీ పాఠశాల, కోరపల్లి సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు నూతన దుస్తులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమ్మికుంట జడ్పిటిసి సభ్యులు శ్రీరాం శ్యామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యను గ్రామీణ ప్రాంతంలో బలోపేతం చేయడంలో అధిక నిధులు కేటాయిస్తుందని వారు గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల కంటే దీటుగా ఎక్కువ మార్కులు సాధించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలోనీ విద్యార్థులు అన్ని రంగాలలో ముందున్నారని వారు గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు అన్ని రకాల అర్హతలు ఉన్న ఉపాధ్యాయులు మాత్రమే బోధన చేస్తారని వారు గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు జడ్పిటిసి సూచించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రేపటి విద్యార్థులే దేశ ప్రగతికి పురోగమిగా నిచ్చే గొప్ప వ్యక్తులుగా మారతారని వారు గుర్తు చేశారు. తల్లిదండ్రులు కష్టపడి ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్న వారి శ్రమను వృధా చేయద్దని వారు విద్యార్థులకు సూచనలు చేయడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయవలసిన బాధ్యత తల్లిదండ్రులది ఆయా గ్రామా పుర ప్రముఖులదని వారు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడిబాట కార్యక్రమం చేపట్టి ఎక్కువ మొత్తంలో విద్యార్థులను చేకూర్చే విధంగా ఆయా ఉపాధ్యాయులు చొర తీసుకోవాలని జడ్పిటిసి సూచన చేయడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో అరకుర సమస్యలను ఉన్నాయని ఈ సమస్యలను వెంటనే తీర్చవలసిన బాధ్యత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని వారు సూచనలు చేయడం జరిగింది. ముఖ్యంగా అటెండర్లు స్కావెంజర్లు లేకపోవడం మూలంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని వారు గుర్తు చేశారు. పదవ తరగతి ఉత్తీర్ణైన విద్యార్థులకు జడ్పిటిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వావిలాల సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, కోరపల్లి ప్రధానోపాధ్యాయులు సమ్మయ్య, వావిలాల ఎంపిటిసి మర్రి మల్లేశం, కోరపల్లి ఎంపీటీసీ మమతా మోహన్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పుల్లూరి సదానందం, బిజెపి గ్రామ అధ్యక్షులు పొన్నం తిరుపతి, ప్రభుత్వ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు చంద్ర కిరణ్, బాలమణి, జ్యోతి ,ఉమా, శ్రీనివాస్, పాఠశాల విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు అందజేత

### గుంటి ఎల్లయ్యను అభినందిస్తున్న గ్రామస్తులు..



చిగురుమామిడి (వాయిస్ టుడే): ఆపదలో అండగా నిలుస్తూ, తనకు తోచిన సహాయం అందజేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుంటి ఎల్లయ్య. మండలంలోని రామంచ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దర్శనం సుశీల కుటుంబ సభ్యులకు గుంటి ఎల్లయ్య బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు అందించినట్లు చెప్పారు. పేదలకు అండగా నిలుస్తున్న గుంటి ఎల్లయ్యను గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఎల్లయ్యను ఆదర్శంగా తీసుకుని తమకు తోచిన విధంగా పేదలకు సహాయ సహకారాలు అందించాలని పలువురు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వంటకాల సంపత్ రెడ్డి, వర్గాల ఐలయ్య, చెరుకు రాజయ్య, తుంగ సదానందం, చెరుకు ఆంజనేయులు, దొబ్బల బాబు, వంటకాల రంజిత్ రెడ్డి, దర్శనం సంపత్, రాజమౌళి, శంకర్, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రణవ్ బాబును మర్యాదపూర్వకంగా కలిసిన గూటం హరిప్రసాద్ రెడ్డి





వీణవంక జూన్ 12(వాయిస్ టుడే): వీణవంక మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గూటం హరి ప్రసాద్ రెడ్డి కి ఇటీవల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా జిల్లా అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ నియామక పత్రం ఇచ్చారు. అందులో భాగంగా బుధవారం రోజు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వొడితల ప్రణవ్ బాబు ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రణబ్ బాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కొరకు అందరిని కలుపుకుపోయి ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో.వంగల కొండల్ రెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి, శివరాత్రి రాజు,కటుకూరి రాజేందర్ రెడ్డి,గూటం సమ్మిరెడ్డి, నరసింహారెడ్డి,



## జమ్మికుంటలో ఘనంగా గో రక్షణ పోస్టర్ ఆవిష్కరణ

జమ్మికుంట జూన్ 12(వాయిస్ టుడే): బుదవారం రోజు విశ్వహిందూ పరిషత్ గో రక్షా విభాగ్ ఉట్కూరి రాధాకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో గోరక్ష పోస్టర్ ను విడుదల చేయడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో కోమల్ల రాజేందర్ రెడ్డి VHP ప్రాంత సేవా ప్రముఖ్ , ఆదిమూల విద్యాసాగర్ VHP జిల్లా ప్రధాన కార్యదర్శి కరీంనగర్ , కంకణాలు రమేష్ రెడ్డి ప్రఖండ ప్రముఖ హుజూరాబాద్ , గుండా వరప్రసాద్ ప్రఖండ ప్రముఖ జమ్మికుంట , కూన మల్లేష్ VHP ప్రఖండ ప్రధాన కార్యదర్శి జమ్మికుంట, అరకాల సర్వేశ్ VHP ప్రఖండ ట్రెజరీ జమ్మికుంట మరియు RSS ప్రముఖులు దాసరి రవీందర్ , బుర్ర శివయ్య , మాధవ రెడ్డి,రఘుపతి రెడ్డి, హరి ప్రసాద్ లు పాల్గొన్నారు. ఇట్టి మేమో రాండంనీ జమ్మికుంట తహాసిల్దార్ కి మరియు SHO జమ్మికుంట పోలీస్ స్టేషన్ కి తగు చర్య తీసుకునే నిమిత్తం ఇవ్వడం జరిగింది. ఆర్.ఎం.పి ,పి ఎం పి ల పై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యం చేస్తున్న ఆర్ఎంపి, పిఎంపీలకు ప్రభుత్వం వెంటనే సర్టిఫికెట్లను ఇవ్వాలి.

## ఆర్.ఎం.పి పి.ఎం.పి రాష్ట్ర వైద్యుల సమైక్య కార్యదర్శి మిట్టపల్లి రాజమౌళి



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూన్ 12 : తెలంగాణ హెల్త్ మెడికల్ కౌన్సిలర్ వారు ఆర్ఎంపి పిఎంపి లపై చేస్తున్న దాడులను ఖండిస్తున్నామని ఆర్ఎంపిపీ ఎంపీ రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి రాజమౌళి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో ఆర్ఎంపి పి.ఎం.పి ల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ హెల్త్ మెడికల్ కౌన్సిలర్ వారు గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉంటూ ఎల్లవేళలా సేవ చేస్తున్న ఆర్ఎంపి ,పిఎంపీలను నకిలీ డాక్టర్లుగా చిత్రీకరిస్తూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని,ప్రభుత్వం చరోచూపాలని అన్నారు. ప్రభుత్వం ఆర్.ఎం.పి పిఎంపీల సేవలను గుర్తించి వెంటనే సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో కమ్యూనిటీ పారామెడికల్ వారు వెయ్యి గంటల శిక్షణ ఇచ్చారని అలాగే 108,104లో పనిచేసమని, గత ప్రభుత్వం ఆర్ఎంపి పి.ఎం.పి లకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇవ్వలేదని అన్నారు. కొందరు క్వాలిఫై డాక్టర్లమంటూ కరీంనగర్లో రక్త పరీక్షల పేరుతో గ్రామీణ ప్రజల వద్ద 5000 నుండి పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్న వారిపై దృష్టి పెట్టకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవ చేస్తున్న ఆర్ఎంపి , పి.ఎం.పి లపై దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దాసి రాజమల్లు, వేములవాడ డివిజన్ అధ్యక్షులు బాలయ్య, గౌరవాధ్యక్షులు కాంతారావు, మండల అధ్యక్షులు మంగళపల్లి రాజేశం, ప్రధాన కార్యదర్శి బిళ్ళ గణేష్ మండల ఆర్ఎంపి పిఎంపీలు పాల్గొన్నారు

# బాగా చదివి తల్లిదండ్రులతో పాటు దేశానికి కీర్తి తేవాలి

### క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలి ఇబ్బందులు ఉంటే నా దృష్టికి తీసుకురండి సరి చేస్తా

### హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



హుజూరాబాద్ జూన్ 12(వాయిస్ టుడే): విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులతో పాటు దేశానికి కీర్తి తీసుకురావాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బుధవారం హుజురాబాద్ లోని ప్రభుత్వ పాఠశాల పునః ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు . ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఎంతోమంది గొప్ప నాయకులతో పాటు మంచి వృత్తిలో కొనసాగుతున్నారని అన్నారు. స్వర్గీయ పీవీ నరసింహారావు కూడా ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేశారని గుర్తు చేశారు. ఈ సంవత్సరం 10వ తరగతి లో హుజురాబాద్ ప్రభుత్వ పాఠశాల 93% ఉత్తీర్ణత సాధించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులను అభినందించారు. వచ్చే ఏడాది వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులను కోరారు. చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనంతో పాటు పుస్తకాలు యూనిఫార్మ్ కూడా అందిస్తుందన్నారు. ఆటలాడుకోవడానికి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలోని మైదానాన్ని కూడా అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని దాని విద్యార్థులు సక్రమంగా ఉపయోగించుకొని ఆటల్లో దేశం గర్వించే విధంగా రాణించాలన్నారు. విద్యార్థులకు పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తప్పక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ కేతిరి వెంకట నర్సింహారెడ్డి, హుజురాబాద్ ఎమ్మార్వో విజయ్ కుమార్, ఎంపీడీఓ ,మున్సిపల్ చైర్పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, ఎంపీపీ రాణి సురేందర్ రెడ్డి, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్, ముత్యం రాజు లతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తాం

శేరిలింగంపల్లి, జూన్ 12(వాయిస్ టుడే) రానున్న బక్రీద్ పర్వదినాని పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ముస్లిం సోదరులకు ప్రార్థనలకుఅన్ని ఏర్పాట్లు చేయాలని నియోజకవర్గ అభివృద్ధికి పక్కా ప్రణాళికలు సిద్ధం ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరిష్ ను కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్, కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ జనాబ్ హమీద్ పటేల్ సాహబ్ సమీక్ష నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్క ప్రణాళికతో ముందుకు వెళ్తుందని, నిధుల మంజూరుకై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి,ఇంచార్జ్ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరిష్ కలిసి సమీక్ష సమావేశం నిర్వహించరు, అనంతరం వారు మంజీర పైప్ లైన్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని వినతిపత్రాన్ని అందించారు.



## ఆర్ట్స్ కళాశాల మరమ్మతు కు ప్రణాళిక రూపొందించండి హెచ్ఎండిఏ నుండి నిధులు విడుదల చేస్తాం

### ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ దాన కిషోర్

### ఓయూ ఆర్ట్స్ కళాశాలను సందర్శన

సికింద్రాబాద్, జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలను యూనివర్సిటీ ఇన్చార్జి వీసి దానకిషోర్ ఐఏఎస్ బుధవారం సందర్శించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కుతాడి అర్జున్ రావు లతో కలిసి కళాశాలలోని లైబ్రరీ తో పాటు తరగతి గదులను, సెమినార్ హాళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ట్స్ కళాశాల భవన మరమ్మత్తు పనులకు తగిన నిధులను హెచ్ఎండి నుండి విడుదల చేస్తామని చెప్పారు. పనులకు తగిన అంచనాలను రూపొందించాలని ఓయూ చీఫ్ ఇంజనీర్ అధికారులతో పాటు హెచ్ఎండిఏ అధికారులకు సూచించారు. ఫెన్సింగ్ ఏర్పాటుతోపాటు ఎస్బిఐ ముందు భాగంలో లాన్ డెవలప్మెంట్ చేయాలని ఆయన అధికారులకు చెప్పారు. మెయిన్ లైబ్రరీ సమీపంలో 500 మంది విద్యార్థుల కెపాసిటీతో ఒక రీడింగ్ రూమ్ ను నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వీటన్నిటికీ అవసరమైన నిధులను హెచ్ఎండిఏ నుంచి విడుదల చేస్తామని దానకిషోర్ తెలిపారు.



## తార్నాకలో అరోమాస్ పేరుతో బిర్యానీ సెంటర్

### విభిన్న ఆహార రుచులకు కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్

### మాజీ మేయర్ కార్తిక రెడ్డి

సికింద్రాబాద్, జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): విభిన్న ఆహార రుచులకు కేరాఫ్ అడ్రస్ గా హైదరాబాద్ నిలుస్తుందని నగర మాజీ మేయర్, బిజెపి సీనియర్ నాయకురాలు బండ కార్తిక చంద్రారెడ్డి పేర్కొన్నారు. తెలుగు అరోమాస్ పేరుతో తార్నాకలో నూతనంగా ఏర్పాటు చేసిన బిర్యాని, పులావ్ కేంద్రాన్ని కార్తీక చంద్రారెడ్డి బుధవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు రుచులతో బిర్యానీ, పులావ్ నాన్ వెజ్ వంటకాలను తార్నాక వాసులకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అభినందనీయమని అన్నారు. హెూటల్ నిర్వహణలో సుచి శుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించాలని నిర్వహకులకు సూచించారు. అనంతరం స్వయంగా ఆమె వంటకాలను రుచి చూశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బండ చంద్రారెడ్డి , వీరన్న, సంపత్, సాయినాథ్ గౌడ్, కిరణ్ గౌడ్, శివారెడ్డి, నిర్వాహకులు పాశం అరవింద్, శ్రావణ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రదీప్ రాజు ఉన్నారు.



# నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ పై సిబిఐ చే విచారణ జరిపిన తర్వాతనే కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించాలి

### ఎన్ టి ఏ డైరెక్టర్ జనరల్ శుబోధ్ కుమార్ని వెంటనే తొలగించి, పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలి

### ఎన్ టి ఏ నిర్వహించిన అన్ని పరీక్షలపై విచారణ చేయాలి: ఏఐఎస్ఎఫ్




సికింద్రాబాద్ జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ పై సిబిఐ చే విచారణ జరిపిన తర్వాతే కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించాలనీ, ఎన్ టి ఏ డైరెక్టర్ జనరల్ శుబోధ్ కుమార్ ని వెంటనే తొలగించి, పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలనీ, గురువారం రోజు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో, పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సిబిఐ చే సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. మే 5 న దాదాపు దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షను రాశార నీ ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు, వారి అనుమానాలకు సజీవ సాక్ష్యం ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం మరల వారి యొక్క పరీక్ష కేంద్రం ఒకటే కావడం వలన వారి అనుమానాలకు బలాన్నిస్తుందన్నారు. పరీక్ష ఫలితాలు జూన్ 14 న విడుదల చేయవలసి ఉండగా, పార్లమెంట్ ఎన్నికల ఫలితాల ముందు రోజు జూన్ 3 న విడుదల చేయడంలో ఉన్న ఆంతర్యం ఏమిటో ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ శుబోధ్ కుమార్ సమాధానం చెప్పాలన్నారు. విద్యార్థులు వివిధ రాష్ట్రాల హైకోర్టులో పిటిషన్లు వేయడం జరిగిందనీ, తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలనీ దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లిన, కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల వేలాది మంది ప్రతిభ గల విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతున్నారన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై, పేపర్ లీకేజీ లపై కేంద్ర ప్రభుత్వం సిబిఐ చే విచారణ జరిపించాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఇటిక్యాల రామకృష్ణ, గ్యార క్రాంతి, రాష్ట్ర నాయకులు చైతన్య, శివ, అన్వర్,వంశీ, వెంకట్, సన్నీ ,జోసెఫ్,మధు, బన్నీ, సాయి, హరీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీష్ రావు ఊచలు లెక్కపెట్టడం ఖాయం

### కాంగ్రెస్ పార్టీ నాయకుడు చక్రధర్ గౌడ్



సికింద్రాబాద్, జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీష్ రావు ఊచలు లెక్కపెట్టడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు చక్రధర్ గౌడ్ పేర్కొన్నారు. తార్నాకలోని ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. సిద్దిపేటలో హరీష్ రావు అక్రమాలను బయట పెడుతున్నందుకు తనను చాలా ఇబ్బందులకు గురిచేసారని చెప్పారు. తనపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పీల్ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించిందన్నారు. రంగనాయక సాగర్ భూముల అవకతవకలపై పోరాడిన వారిపై అక్రమ కేసులు పెట్టడం జరిగిందన్నారు. ఇప్పటికి సిద్దిపేట పోలీసు వ్యవస్థ హరీష్ రావు చేతల్లోనే ఉందన్నారు. ఆగస్టు 15వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తే హరీష్ రావు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారని గుర్తుచేశారు. రాజీనామా కాదని హరీష్ రావు బీజేపీ లోకి పోయే ప్రయత్నం చేస్తున్నాడని చెప్పారు. ఆ ప్రయత్నంలో భాగంగానే ముందు గంగుల కమలాకర్ ను బీజేపీ లోకి పంపిస్తున్నాడన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు నుంచి తప్పించుకోవడానికి బీజేపీ లో పోయేందుకు కేంద్రంలో పెద్దలతో మంతనాలు జరుపుతున్నాడని పేర్కొన్నారు.

## బ్యాటరీ ఆపరేటెడ్ వెహికల్ ను ప్రారంభించిన మంత్రి

### కార్పొరేట్ సామాజిక బాధ్యత లో భాగం గా యూనియన్ బ్యాంక్ అందజేత



వరంగల్ జూన్ 12 (వాయిస్ టుడే) కార్పొరేట్ సామాజిక (సి ఎస్ ఆర్) బాధ్యత లో భాగంగా యూనియన్ బ్యాంక్ వారు రు.3 లక్షల వ్యయం తో కొనుగోలు చేసిన బ్యాటరీ ఆపరేటర్ వెహికల్ ను ఫోర్ట్ వరంగల్ లో గల టూరిజం విభాగానికి రాష్ట్ర పర్యావరణ అటవీ మరియు దేవదాయ శాఖ మాత్యులు కొండ సురేఖ ఖిలా వరంగల్ లో బుధవారం ప్రారంభించి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ యూనియన్ బ్యాంక్ వారి సేవలను ప్రశంసిస్తూ సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచడానికి ఖిలా వరంగల్ కు వచ్చే పర్యాటకులకు ముఖ్యం గా పిల్లలు వృద్దులకు ఉచితం గా సేవలు అందజేయడం అభినందనీయమని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి బ్యాంక్ రీజినల్ మేనేజర్ సత్యం లీడ్ బ్యాంకు మేనేజర్ హవేలీ రాజు వినోద్ రవి తదితరులు పాల్గొన్నారు.




## కార్పోరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

### అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): కార్పోరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే , మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 16 ప్రభుత్వ పాఠశాల లలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాన్ని పద్మారావు గౌడ్ బుధవారం లాంచనంగా ప్రారంభించారు. అడ్డగుట్ట ఆజాద్ చంద్రశేఖర్ నగర్ లోని ప్రభుత్వ ప్రాథమిక స్కూల్ లో విద్యార్థులకు పుస్తకాలు, యునిఫారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిదిలోని అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సితాఫల్మండీ, బౌద్దనగర్ డివిజన్ల లో దాదాపు 30 ప్రభుత్వ స్కూల్స్ ఉన్నాయని చెప్పారు. వాటిలో 16 స్కూల్స్ లో వివిధ సదుపాయాలని కల్పిస్తున్నామని తెలిపారు. సీతాఫల్మండి ప్రభుత్వ స్కూల్ లో జూనియర్, డిగ్రీ కాలేజీ లను ఏర్పాటు చేయించామని, కొత్త భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. గతంలో 10 స్కూల్స్ కు ‘ మన బడి – మన బస్తీ’ కార్యక్రమంలో భాగంగా వివిధ సదుపాయాలను కల్పించేందుకు వీలుగా ఏర్పాట్లు జరిపామని గుర్తు చేశారు. బ్రాహ్మణ బస్తీ లోని ప్రభుత్వ స్కూల్ కు కొత్త భవనాలను నిర్మించే ప్రతిపాదనలు చేశామని, జామై ఉస్మానియా ప్రభుత్వ స్కూల్ లో వివిధ సదుపాయాలు కల్పించే ఏర్పాట్లు జరిపామని తెలిపారు. లాలాపేట మార్కెట్, అంబర్ నగర్, డైరీ ఫారం, దూద్ బావి, ఆజాద్ చంద్ర శేఖర్ నగర్ ప్రభుత్వ స్కూల్ వివిధ సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆజాద్ చంద్రశేఖర్ నగర్ స్కూల్ కు వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, సామల హేమ, విద్యాధికారి బాలు నాయక్, యుసీ డీ ప్రాజెక్ట్ అధికారి శ్రీనాద్, విద్యాధికారి మదన్ మోహన్, నేతలు రామేశ్వర్ గౌడ్, విజయ కుమారి, ఝాన్సీ రాణి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జిచే విచారణ జరిపించాలి: ఏఐఎస్ఎఫ్



సికింద్రాబాద్, జూన్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జి చేత విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ నాయకులు డిమాండ్ చేశారు. పరీక్ష కుంభకోణం పట్ల బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సుబోత్ కుమార్ సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఓయూ లో విలేఖరుల సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ నీట్ పరీక్ష కుంభకోణంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించి 24 లక్షల మంది విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాల కోసం 2024 సంవత్సరం నీట్ పరీక్ష నిర్వహించిన విధానంలోనూ, పరీక్ష ఫలితాలను వెల్లడించిన విధానంలోనూ అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. వాటిపైన వెంటనే కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు జడ్జి చేత విచారణ జరిపించాచి, దోషులను కఠినంగా శిక్షించాలాన్నారు. నీట్ ఎగ్జాం ని రద్దు చేసి మళ్లీ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మే 4వ తేదీన నిర్వహించిన నీట్ ఎగ్జామ్ పేపర్ ముందే లీక్ అయిందని, చినిగిన ఓఎంఆర్ షీట్లు ఇచ్చారని, పరీక్షను కొన్ని సెంటర్లలో సకాలంలో నిర్వహించలేదని పేర్కొన్నారు. అదేవిధంగా పరీక్ష షెడ్యూల్ ప్రకారం ఫలితాలను జూన్ 14న ప్రకటించాలని, అలా కాకుండా ముందుగానే జూన్ 4వ తేదీన ఎందుకు ప్రకటించారని ప్రశ్నించారు. ప్రకటించిన ఫలితాలలో ఒకే పరీక్ష సెంటర్లో పడినటువంటి ఆరుగురు విద్యార్థులకు 720 కి 720, మార్కులు ఏవిధంగా వస్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులు దీనికి సమాధానం చెప్పాలన్నారు. 2016వ సంవత్సరం నుండి దేశవ్యాప్తంగా వైద్య విద్యను సెంట్రలైజేషన్ (కేంద్రీకరణ) చేస్తూ నిర్వహిస్తున్న నీట్ ఎగ్జాం ని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం 2016 సంవత్సరంలోనే వ్యతిరేకించిందని గుర్తు చేశారు. 2016 సంవత్సరానికి ముందు ఆయా రాష్ట్రాలు వైద్య విద్య ప్రవేశ పరీక్షలు నిర్వహించి సీట్లను కేటాయించేదని, కానీ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా నీట్ ఎగ్జాం నిర్వహించి సీట్లను కేటాయించిందన్నారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా పేద మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యారని అవేదన వ్యక్తం చేశారు. నీట్ విద్యార్థులకు న్యాయం చేయకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ ఓయూ సహాయ కార్యదర్శి భగత్, నాయకులు శ్రీకాంత్, నాగరాజు, రమేష్, దిలీప్, శశివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# నేటీ నుండి బడిబాటలో విద్యార్థులకు సౌకర్యాలతో వసతుల కల్పన

## ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



శేరిలింగంపల్లిబీ జూన్ 12(వాయిస్ టుడే) బడిబాట కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లి విలేజ్ లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు మండల ప్రాథమిక పాఠశాలలో బడి బాట కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ లను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు బుధవారం తెరచుకున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన 'బడిబాట' కార్యక్రమం 19వ రకు బడి బాట కార్యక్రమం కొనసాగిందని, ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. తొలిరోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫారాలు అందజేస్తున్నామని, అదేవిధంగా 1 వనుండి 5 వరకు విద్యార్థులకు ఉచిత వర్క్‌షీట్‌లు, పుస్తకాలు మరియు 6 వ తరగతి నుండి 10 తరగతి విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్‌లు, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ లు పంపిణీ చేశామని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో అవసరమైన మరమ్మతు పనులను దాదాపు పూర్తి చేశామని తెలిపారు. అదేవిధంగా తరగతి గదులను అలంకరించి, ప్రవేశ ద్వారాలకు మామిడి తోరణాలు కట్టి పండగ వాతావరణంలో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేశామని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామని, తన వంతు కృషి, సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎమ్మెల్యే గాంధీ అన్నారు.

గత ప్రభుత్వం హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేసిన 'మన ఊరు-మన బడి' - 'మన బస్తి-మన బడి' కార్యక్రమంతో సర్కారు బడులు కొత్తరూపు సంతరించుకున్నాయని, సకల హంగులతో సర్వాంగ సుందరంగా తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలు, సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పనకు

తెలంగాణ గురుకులాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని దేశంలోకెల్లా అత్యధిక గురుకుల విద్యాలయాలు కలిగిన ఏకైక రాష్ట్రం మన తెలంగాణ అని పేర్కొన్నారు. అదేవిధంగా 1,002 గురుకుల పాఠశాలల్లో 5,99,537 మంది విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన జరుగుతున్నదని, ప్రతి విద్యార్థిపై సంవత్సరానికి 1 లక్షా 25 వేల రూపాయలు తెలంగాణ ప్రభుత్వం వెచ్చిస్తున్నదని సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పనకు మన ఊరు-మన బడి, మన బస్తి - మన బడి కార్యక్రమాన్ని తీసుకొచ్చి వాటి రూపురేఖలే మార్చేస్తున్నదని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. విద్యతోనే వికాసం, విద్యతోనే ఆత్మవిశ్వాసం, ప్రతి తరగతి గది, తరగని విజ్ఞానగని ఆ నాలుగుగోడలే, దేశ భవిష్యత్తుకు మూలస్తంభాలు. ఈ సిద్ధాంతాన్ని నమ్మడమే కాదు, అక్షరాలా ఆచరించిందని, మన ఊరు-మన బడితో సమూల మార్పులు 26 వేల పాఠశాలలకు సరికొత్త రూపురేఖలు, సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనమైనా అని సర్కారు బడిలో ఇంగ్లీష్ మీడియం బోధనైనా..ప్రతి ఆలోచన విప్లవాత్మకమని ప్రతి నిర్ణయం ప్రతిష్ఠాత్మకం.. ఇమన భావితరాలకు బంగారు బాటలేసే ఈ మహాయజ్ఞంలో మేముసైతం అంటూ మనసుపెట్టి పనిచేస్తున్న ఉపాధ్యాయులకు క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు

సేవలు అందిస్తున్న ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నా మని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శైలజ , బిమయ్య, మహేందర్ శేరిలింగంపల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మారబోయిన రాజు యాదవ్, మాదాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చింత కింది రవీందర్ గౌడ్, ప్రసాద్ పద్మారావు, పొడుగు రాంబాబు, కొండల్ రెడ్డి, లింగం శ్రీనివాస్, రమేష్, వేణు గోపాల్ రెడ్డి, నటరాజ, రవి యాదవ్ ,రమణయ్య, గోవిందా చారి, అహ్మద్, అజాం, మరియు ఉపాధ్యా యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి ఆలయ అధికారులతో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రివ్యూ సమావేశం



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- యాదాద్రి ఆలయ అధికారులతో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ అభివృద్ధిపై,భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఈ సమావేశంలో మాట్లాడారు. దర్శనం చేసుకుని బయటకు వచ్చేటువంటి భక్తులకు తాత్కాలిక షెడ్డు నిర్మాణంతో వారు ప్రశాంతంగా ఉంటున్నారని ఈ విషయం పట్ల ఆలయ అధికారులకు అభినందనలు తెలిపారు. అదే విధంగా మరికొన్ని చోట్ల మూత్రశాలలు ఏర్పాటు చేయాలన్నారు. స్వాతి నక్షత్రం సందర్భంగా గిరిప్రదక్షిణ చేసే వారికి రోడ్డు నిర్మాణం పూర్తి చేసి లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. డార్మెంటరీ హాల్ లో పడుకునే వారి సంఖ్య ఎక్కువ ఉండేందుకు హాల్ పెంచుతున్నట్లు,తెలిపారు. అన్నదాన సత్రంలో 1000మంది భక్తులు భోజనం చేసేవిధంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దాంతో పాటు కొండపైన ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గూడురు టోల్ గెట్ నుండి రాయగిరి కమాన్ వరకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. మెట్ల మార్గంపై సోలార్ షెడ్ నిర్మాణం చేసి నీటి సౌకర్యం తో పాటు,మూత్రశాలలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆలయంలో సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలని వారికి ఒక డ్రెస్ కోడ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. దాంతోపాటు యాదాద్రిలోని పలు కూడళ్లలో స్వామివారి పేర్లతో నామకరణం చేయాలని సూచించారు. భక్తులకు ఎక్కువ సౌకర్యాలు కల్పిస్తే ఎక్కువ భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారని తెలిపారు. ఎల్ఇడి స్క్రీన్స్ ద్వారా ఆలయంలో జరిగే పూజలను ప్రజలు వీక్షించే విధంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగా మీడియా వారికి మీడియా పాయింట్ కూడా ఏర్పాట్లు చేయునట్లు తెలిపారు.



## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

### పుస్తకాలు పంపిణీ చేసిన మూసాపేట్ కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్

కూకట్ పల్లి : జూన్ 12(వాయిస్ టుడే) వేసవి సెలవులు పూర్తిచేసుకుని తిరిగి బడిబాట పట్టిన విద్యార్థులకు బుధవారం కూకట్ పల్లి సర్కిల్ మూసపేట కార్పొరేటర్ మహేందర్ బబ్బుగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్వాగతంపలికి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నడవడికపై, వారి చదువు పై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు ఉపాధ్యాయులను సంప్రదించాలని, పిల్లల నడవడిక ను తల్లిదండ్రులు ఎక్కటి కప్పుడు గమనించాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు, బిజెపి డివిజన్ కార్యదర్శులు ఎర్ర స్వామి, భాస్కర్, సీనియర్ నాయకులు మల్లేష్ గౌడ్, టైగర్ యాదగిరి యాదవ్, ఐలయ్య, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా కాంగ్రెస్ నేత జీవీఆర్ జన్మదిన వేడుకలు

కూకట్ పల్లిబీ జూన్ 12(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు జన్మదినోత్స వాన్ని పురస్కరించుకుని బుధవారం పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి జీవీఆర్ సేన అభిమానులు, పార్టీ శ్రేణులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ మేకల, వలకొండ ప్రభాకర్ రావు, ఎలీషాం, గజ్జెల శివ, హైతబాధ సాయికరణ్, రవికాంత్, సైదులు, అనిల్, నరసింహ, పి సాయిరామ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు




## కెపిహెహెచ్ బీ కార్యాలయంలో జనసేన సైనికులు, వీర మహిళల సంబరాలు

కూకట్ పల్లిబీ జూన్ 12(వాయిస్ టుడే) ఆంధ్రప్రదేశ్ లో నూతన ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్గంలో మొట్టమొదటిసారిగా రాష్ట్ర డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టారు. సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలో కెపిహెచ్బి కాలనీ 5వ ఫేస్ జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భముగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతూ జనసేన నాయకులు మరియు వీర మహిళలు. ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం మీడియా కోఆర్డినేటర్ కొల్లా శంకర్ మాట్లాడుతూ ఇది ప్రజా విజయమని, దశాబ్ద కాలంగా పవన్ కళ్యాణ్ మరియు జన శ్రేణులు ప్రజల కొరకు అనునిత్యం అనేక సమస్యలపై పోరాడి ప్రభుత్వాన్ని ప్రశ్నించి 2024 అసెంబ్లీ ఎన్నికలలో జనసేన, టిడిపి, బిజెపి కూటమి నాయకత్వంలో జనసేన పార్టీ అధినాయకుడు కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో 21 ఎమ్మెల్యేలు ఘనంగా విజయాన్ని సాధించారని, ఇక నుండి ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు నాయకతళలూ ప్రజా పాలన కొనసాగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి కాలనీ డివిజన్ ప్రెసిడెంట్ కలిగినీడి ప్రసాద్, పులగం సుబ్బు, బోగాది శేషగిరిరావు, పూషడపు సురేష్, శ్రీనివాస్ గోవింద, ఆవుల రంగబాబు, బండారి వెంకటేష్ , ఘంట నవీన్, గుణశేఖర్, క్రాంతి కుమార్, వీర, నీరజ్, మురళి, బాలాజీ, మరియు వీర మహిళలు ఎర్ర సత్యా, అడబాల లక్ష్మి, గాలి సునీత తదితరులు పాల్గొన్నారు.



## బడి బాట కార్యక్రమంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

### :-ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- తెలంగాణ ప్రభుత్వం ప్రతి యేడు నిర్వహించే బడి బాట కార్యక్రమంలో భాగంగా మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ తిరుమల నగర్ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించడం లక్ష్యంగా పాఠ్యపుస్తకాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్,ఉపాధ్యాయులు అలాగే స్థానిక నాయకులు మల్లేష్ గౌడ్, నరసింహ,శేఖర్ గౌడ్,నిసార్ అహ్మద్ గోరి తదితరులు పాల్గొన్నారు.



## భూగర్భ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తాం

### ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి

### సిల్ట్ గ్రాబెర్ తో ట్రంక్ లైన్ క్లినింగ్ పనులను పరిశీలించిన కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఉప్పల్ డివిజన్ లోని కాలనీలలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ లోని న్యూ శాంతి నగర్ హనుమాన్ టెంపుల్ నుండి ట్రంక్ లైన్ ను సిల్ట్ గ్రాబెర్ యంత్రం ద్వారా క్లీనింగ్ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులను కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ట్రంక్ లైన్ లలో తలెత్తిన ఇబ్బందులతో డివిజన్ లోని పలు కాలనీలలో భూగర్భ డ్రైనేజీ సమస్య ఏర్పడిందన్నారు. సిల్ట్ గ్రాబెర్ తో ట్రంక్ లైన్లను క్లియర్ చేయడంతో శాంతి నగర్,న్యూ శాంతి నగర్,సాయి బాబా కాలనీ, సత్యనగర్, తదితర కాలనీలలో డ్రైనేజీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ -సి సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, డివిజన్ జెనరల్ సక్రెటరీ తుమ్మల దేవి రెడ్డి,న్యూ విజయ్ పూరి కాలనీ ,సాయిబాబా కాలనీ,న్యూ శాంతినగర్ కాలనీ వాసులు నాగిరెడ్డి,వెంకటేష్ సెట్,వర్కల మధన్ గౌడ్,నర్సింహ రెడ్డి,రత్నం,వెంకట్ రెడ్డి,శ్రీనివాస్,అలుగుల అనీల్ కుమార్,సురేష్ యాదవ్, సుబ్బా రెడ్డి,తుమ్మల రాజేందర్ రెడ్డి,అంజిరెడ్డి,సుమన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా అశోక హెూటల్ 50వ వార్షికోత్సవం

లకిడికపూల్ : జూన్ 12 ( వాయిస్ టుడే ) ప్రోగ్రెసివ్ హెూటల్స్ ప్రైయివేట్ లిమిటెడ్ 50వ వార్షికోత్సవం నగరంలో ఘనంగా నిర్వహించినట్లు ప్రోగ్రెసివ్ హెూటల్స్ ప్రైయివేట్ లిమిటెడ్ ఎండీ కార్తీష్ రెడ్డి మాద్గుల బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 జూన్ 1974న స్థాపించ బడినప్పటి నుండి హాస్పిటాలిటీ పరిశ్రమలో అర్ధ శతాబ్దపు శ్రేష్ఠత, ఆవిష్కరణలను గుర్తు చేసుకున్నారు. నగరంలో హాస్పిటాలిటీ కమ్యూనిటీలో వృద్ధి, శ్రేష్ఠత వారసత్వాన్ని కొనసాగిస్తూ మూడవ తరం వ్యాపారవేత్త ద్వారా కంపెనీ ముందుకు సాగుతోందన్నారు. ఈ ఐదు దశాబ్దాల పాటు సాగిన మా ప్రయాణం సౌకర్యం, కస్టమర్ సేవలో నిరంతర మెరుగుదలలు, శ్రేష్ఠత కోసం కనికరంలేని అన్వేషణ, ఆతిథ్యం పట్ల గాఢమైన అభిరుచిని కలిగి ఉందన్నారు. ఈ డైనమిక్ హాస్పిటాలిటీ యుగంలో ప్రతి అతిథి అనుభవం చిరస్మరణీయమైనదిగా ఉండేలా ఆవిష్కరణ సంప్రదాయాన్ని కలిసే భవిష్యత్తును రూపొందించడమే తమ లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా హెూటల్ మేనేజర్ జావేద్ ఆధ్వర్యంలో కంపెనీ ఎండి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

## డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గారు



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సందర్శించారు. అనంతరం అక్కడి ప్రజలు డ్రైనేజీ సమస్య తో తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమాచారంతో నిలిచి పోయిన నీటి కాలువ లను పరిశీలించారు. కాలువ నీరు బయట కు వెళ్ళేందుకు వెంటనే చర్యలు తీసుకొని డబుల్ బెడ్రూం వద్ద నివసిస్తున్న ప్రజల సమస్యను పరిష్కరించాలని అక్కడి మున్సిపల్ కమిషనర్,కు ఎమ్మార్వో కు ఆదేశాలు ఇచ్చారు.

# ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఎనలేని కృషి

**విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలో చదవాలి**

**విద్యార్థులకు నోట్ బుక్స్ యూనిఫామ్స్ పంపిణీ చేసిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**




వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూన్ 12 జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం లోని విలసాగర్ ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విద్యార్థులకు యూనిఫామ్స్ మరియు పుస్తకాల పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య ను బోధిస్తున్నట్లు తెలిపారు . గత ప్రభుత్వంలో విద్యపై నిర్లక్ష్య ధోరణి వివరించిందని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు 2000 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు.కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యను అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందనీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రుల సహకారంతో పాఠశాలలో మౌలిక వసతుల పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ఇస్తామని అమ్మ ఆదర్శ పాఠశాల లో భాగంగ పాఠశాలలను తీర్చిదిద్దినట్లు తెలిపారు.దేశ భవిష్యత్తు తరగతి గదినుండే ప్రారంభమవుతుందని నానుడిని గుర్తుంచుకొని విద్యార్థులు ఉత్తమ లక్ష్యాలతో ముందుకు సాగుతూ భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఏధగాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉంది. ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా పనిచేసే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనీ అన్నారు.

పాఠశాలల్లో ఏవైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి పర్లపల్లి వేణుగోపాల్,మాజీ డిసిఎంఎస్ సురేందర్ రెడ్డి,సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, తహసిల్దార్ పుష్పలత ఎంపీడీవో జయశేల,మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షితులు,ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, మాజీ జెడ్పిటిసి పులి లక్ష్మీపతి గౌడ్,ఎంపీటీసీ అక్కనపల్లి ఉపేందర్,జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కూస రవీందర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఏనుగుల కనకయ్య,జోగు, సురేందర్ ,రామిరెడ్డి శ్రీనివాస్ ,సందిసంపత్ కుమార్ , సంభ లక్ష్మీరాజం,బండారి రాములు, ఏనుగుల ప్రశాంత్, నాగుల వంశీ, నిమ్మ వినోద్ రెడ్డి, బోయిని ఎల్లేష్ ,అక్కనపల్లి కరుణాకర్ , అమ్మిగల్ల గోపాల్,రాజు, మొండయ్యా, శాలివాహన శ్రీనివాస్, రాకేష్,మంద వెంకటేష్, లాల్ కనకయ్య, శ్రీనివాస్,తదితరులు ఉన్నారు

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న ఎం ఇ ఓ మహేశ్వర్ రెడ్డి



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి జూన్ 12 2024 (వాయిస్ టుడే) : విద్యా సంవత్సరం ప్రారంభం రోజున గురుకులానికి రావడం అభినందనీయమని బెల్లంపల్లి ఎం ఇ ఓ మహేశ్వర్ రెడ్డి అనారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ లో పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అథిదిగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ముందుగా ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలలో సమాచారాన్ని ఎప్పటికీ ఎప్పుడు ఉపాధ్యాయుల సహకారంతో కొత్త విషయాలను సూక్ష్మ దృష్టితో చదవడం అలవాల్చుకోవాలన్నారు. విద్యార్థులు విజయవంతంగా గత తరగతులను పూర్తిచేసుకుని నూతన విద్యా సంవత్సరంలో పై తరగతులకు రావడం అభినందనీయమన్నారు. ఉత్తమ జ్ఞానంతో అన్ని విషయాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండడం వల్ల ఉత్తమ విద్యార్థిగా తయారు కావచ్చు అన్నారు. సమాజాన్ని అర్థం చేసుకుంటూ పాఠ్యపుస్తకాలలోని అంశాలను అనుసంధానం చేసుకోవడం విద్యార్థులకు నేర్పాలని ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా రంగుల బొమ్మలతో అలంకరించిన 5వ తరగతి గదులను విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు చూపించి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మహనీయుల చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఐనాల సైదులు, వైస్ ప్రిన్సిపల్ కోట రాజ్ కుమార్, జి వి పి శ్యాంసుందర్ రాజు, పేరెంట్స్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పూదరి నగేష్ గౌడ్, దాగం మహేష్, సీనియర్ ఉపాధ్యాయులు వరమని ప్రమోద్ కుమార్, షిండే దత్త ప్రసాద్, దాసం అజిత, దుర్గం రమాదేవి,యండి కౌసర్, కోట్రంగి గణపతి, సజ్జనపు విజయ్,విద్యార్థుల తల్లిదండ్రులు అడ్డూరి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

### మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి


మక్తల్ జూన్ 12 వాయిస్ టుడే ప్రతినిధి: జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు సైబర్ నేరాల పై మక్తల్‌లోని TGSWRS% స్కూల్, కళాశాల విద్యార్థులకు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించామని మఖ్తల్ ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి, సైబర్ నేరానికి గురైతే 1930 గుర్తుకు రావాలని..హోటల్ రూమ్స్, టెంపుల్ టికెట్స్ మరియు ట్రైన్ టికెట్స్ బుకింగ్స్ కోసం ఆన్లైన్లో సెర్చ్ చేస్తున్నారా?... జాగ్రత్త సైబర్ మోసగాళ్లు గూగుల్ యాడ్స్ కొనుగోలు చేసి నకిలీ నెంబర్లు పోస్ట్ చేస్తున్నారని. అందులో ఉన్న నకిలీ నంబర్లకు కాల్ చేస్తే సైబర్ మోసగాళ్లు బుకింగ్ కోసం ముందుగా కొంత డబ్బులు కట్టాల్సి ఉంటుందని మీకు క్యూఆర్ కోడ్ పంపించి దానికి డబ్బులు పంపించమంటారు వాళ్ళు చెప్పింది నమ్మి క్యూఆర్ కోడ్ కు స్కాన్ చేసి డబ్బులు పంపించకండి అది సైబర్ నేరగాళ్ల పని అని గుర్తుంచుకోండని సూచించారు. కస్టమర్ కేర్ నెంబర్ను సంబంధిత వెబ్సైట్ నుండి మాత్రమే తీసుకోవాలని.. సైబర్ నెరజాలు గూగుల్ నందు నకిలీ కస్టమర్ కేర్ నెంబర్లను ఉంచి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మీకు కాల్ చేసి కస్టమర్ కేర్ వాళ్లు ఏదైనా లింక్స్ ద్వారా కానీ ఫోన్ కాల్ లో గాని మీ బ్యాంక్ వివరాలు అడిగినా లేదా ఏదైనా యాప్ ఇన్స్టాల్ చేయమని చెప్పినా వాళ్ళు సైబర్ మోసగాలని గుర్తించాలని అన్నారు. ఎవరైనా మిమ్మల్ని మెసేజ్ ఫోన్ కాల్స్ ద్వారా మీకు బ్యాంక్ వివరాలు అడిగితే వాళ్ళు సైబర్ నేరగాలని గుర్తించండి బ్యాంకు వారు మరియు ఏ కస్టమర్ కేర్ సంస్థ వారైనా మీ బ్యాంకు వివరాలు మరియు ఓటీపీని అడగరని గుర్తించుకోవాలని తెలిపారు. గూగుల్లో కంటికి కనిపించిన ప్రతిదీ నమ్మకండి కొంచెం ఆగి ఆలోచించండి అది సైబర్ మోసం కూడా ఉండవచ్చని.. మీకు తెలియని వ్యక్తులు కాల్ చేసి కానీ మీ ఫోన్ లో లింకు ద్వారా కానీ మీ బ్యాంకు ఖాతా వివరాల గురించి అడిగితే వాళ్ళు ఆన్లైన్ మోసగాలని గుర్తించాలని సూచించారు. ఆన్లైన్ లోన్ ఆప్ లను మీ ఫోన్లో డౌన్లోడ్ చేసినప్పుడు మీ ఫోన్లో ఉన్న అన్ని ఫోన్ నెంబర్లు ఫోటోలు మరియు మీ వ్యక్తిగత వివరాలు యాప్ వారు మీ అనుమతి లేకుండా తీసుకుంటారని.. తర్వాత లోన్ తిరిగి కట్టిన ఎక్కువ డబ్బులు కట్టమని ఆ వివరాలతో మిమ్మల్ని వేధింపులకు గురిచేస్తారు జాగ్రత్తని.. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మీ పేరు మీద మా యాప్ లో లోన్ వచ్చింది కావాలంటే యాప్ ఇన్స్టాల్ చేసి చెక్ చేసుకోండి అంటే నమ్మకండిమని.. ఆ యాప్ ద్వారా మీ వ్యక్తిగత వివరాలు సేకరించి మోసం చేస్తారు అని విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించి సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

# రైతుల ప్రాణాలతో చెలగాట మాడుతారా?

**లూజు లైన్‌లు ఎందుకు సరిచేయరు.**

**ఇంత పెద్ద ఊరికి ఒక్కరే హెల్పర్ ఎట్లా ఉంటాడు?అని సెస్ ఏఈనీ నిలదీసిన మాజీ ఎంపీటీసీ,రైతులు.**

**24 గంటల లోపు పర్మినెంట్ హెల్పర్‌ను నియమిస్తామని సెస్ ఏ ఈ హామీ.**



వాయిస్ టుడే న్యూస్ సిరిసిల్ల జిల్లా జూన్ 12: రైతుల ప్రాణాలు గాలిలో కలిసిపోయిన పర్వాలేదా?పంట పొలాల్లో లూజు లైన్ విద్యుత్ తీగలు ఉంటే ఎందుకు సరి చేయరు. మిడిల్ పోల్స్ ఎందుకు వేయడం లేదు.ఇంత పెద్ద ఊరికి ఒక్కరే హెల్పర్ ఉంటే విద్యుత్ బ్రేక్ డౌన్ సమస్యలు ఎట్లా తీరుతాయని ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్ తో పాటు రైతులు సెస్ ఏ ఈ పృథ్వీధర్ ను నిలదీశారు. బుధవారం స్థానిక మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో రైతులు, గృహ వినియోగదారులు ఎల్లారెడ్డిపేటలో గల సెస్ కార్యాలయానికి వెళ్లి సెస్ ఏ ఈ నీ నిలదీశారు.సెస్ అధికారుల పనితీరుకు నిరసనగా సెస్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.మండల కేంద్రము లో పంట పొలాల్లో విద్యుత్ తీగలు ఉయ్యాల లాగ వేలాడుతున్న ఎందుకు వాటిని సరిచేయడం లేదని ఏ ఈ నీ ప్రశ్నించారు. మిడిల్ పోల్స్ గురించి రైతులు వచ్చి కావాలని అడిగితే ఎందుకు ఇవ్వడం లేదని, ఎల్లారెడ్డి పేటలో 8000 గృహవసరాల విద్యుత్ మీటర్లు ఉండగా గతంలో ఇద్దరు హెల్పర్లు ఉండగా గంభీరావుపేట నుండి వచ్చిన రాజ లింగం అనే హెల్పర్ ను ఇక్కడి నుండి ఎందుకు బదిలీ చేశారని కేవలం ఒక్క హెల్పర్ వెంకటేష్ ఉండడం వల్ల వ్యవసాయ, గృహవసరాల బ్రేక్ డౌన్ లు సరిచేయడం ఒక్కడికి పనికి మించిన భారం అవుతుందనీ మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్ సెస్ ఏ ఈ తో అన్నారు. మీరు చెప్పింది నిజమే 24గంటల లోపు పర్మినెంట్ హెల్పర్ ను రాజలింగం స్థానంలో విధుల్లోకి తీసుకుంటానని ఏ ఈ హామీ ఇచ్చారు.గృహ జ్యోతి కింద దరఖాస్తు గతంలో చేసుకోలేని వారు ఇప్పుడు చేసుకోవాలంటే ఇబ్బంది అవుతుందనీ దీనికి సంబంధించి స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరగా ఎంపిడిఓ సత్తయ్య దృష్టికి తీసుకు వెళతానని అన్నారు.గత 15రోజుల క్రితం గ్రామంలో 1,2 వ వార్డులలో హై ఓల్టేజ్ విద్యుత్ సరఫరా కావడంతో విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయని ఇట్లాంటి పరిస్థితుల్లో వినియోగదారులకు నష్ట పరిహారం అందించేలా సెస్ పాలకవర్గం తీర్మాణించాలని సెస్ ఏ ఈ కి ఇచ్చిన వినతి పత్రం లో పేర్కొన్నారు. వినియోగదారులు బిల్లులు చెల్లించడానికి గ్రామ పంచాయతీ కి వస్తె అయిదు రోజులు మాత్రమే బిల్లులు తీసుకుంటున్నారని ఇది వారం రోజుల పాటు తీసుకునేలా చూడాలనీ అందులో ఒక రోజు డబల్ బెడ్ రూం లలో,కిష్టంపల్లి లో నివాసముంటున్న వారి కోసం ఒక రోజు కేటాయించి అక్కడే బిల్లుల కౌంటర్ చెల్లింపు కేంద్రం ఏర్పాటు చేయాలని సెస్ ఏ ఈ నీ కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రతి రోజు కరెంట్ తీసివేయకుండా చూడాలని కోరారు. ప్రజా పాలన లో గత మూడు నెలల పాటు జీరో బిల్లు వచ్చి ఇప్పుడు బిల్లులు ఎందుకు వస్తున్నాయని దీనిపై విచారణ చేయాలని కోరారు. మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్ వెంట కాంగ్రెస్ నాయకులు బుచ్చి లింగు సంతోష్ గౌడ్,పుల్లయ్య గారి తిరుపతి గౌడ్, దీటి బాలయ్య,,బాద శ్రీనివాస్, గౌరిగారి గోపి, దీటి మురళీ, నేవూరి రాజిరెడ్డి, రవీందర్ రెడ్డి,రాగుల శ్రీకాంత్ రెడ్డి, గుండాడి శ్రీనివాస్ రెడ్డి, కటకం దేవయ్య, ఎండపల్లి అరుణ్ కుమార్,శ్రీరాం కళ్యాణ్,రాగుల సంతోష్ రెడ్డి చందనం అనిల్ నిజామాబాద్ నర్సయ్య, వీరమ్మ గారి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## నేటి జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూన్ 12 రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ, ఎస్పీ అఖిల్ మహాజన్ ఆద్వర్యం లో నేడు నిర్వహిస్తున్న ఉచిత మెగా జాబ్ మేళా ను బోయిన్పల్లి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. బోయినపల్లి మండలం విలాసాగర్ లో బుధవారం జాబ్ మేళా పోస్టర్ ను ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 13న పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా జాబ్ మేళా నిర్వహిస్తున్న జాబ్ మేళా కు మండల యువత అత్యధిక మొత్తంలో పాల్గొనివిజయవంతం చేయగలరని కోరారు. దీనిలో దాదాపు 60 పైచిలుకు కంపెనీలు రానున్నాయని దీనికి కావాల్సిన క్వాలిఫికేషన్ టెన్త్ డిగ్రీ వరకు టెక్నికల్ నాన్ టెక్నికల్ రెండిట్లో కూడా యువత ఎవరైతే క్వాలిఫై ఉంటారో వారు డీటెయిల్స్ బయోడేటా లింక్ అనేది క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ఆ లింక్ వచ్చిన తర్వాత దాన్ని దాని నిమిత్తమై 13వ తారీఖున కళ్యాణ లక్ష్మి గార్డెన్స్ లో సిరిసిల్ల నందు వారికి వారికి ఇంటర్వ్యూ చేసి వారి యొక్క అర్హత మేరకు వారికి వివిధ కంపెనీలలో ఉద్యోగ ఉద్యోగరీత ఉన్నాయి కాబట్టి బోయినపల్లి మండలం లోని యూత్ అందరూ కూడా వారి యొక్క బయోడేటా ను ఫీల్ చేసి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు .



## టెన్నిస్ కోర్ట్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

వాయిస్ టుడే న్యూస్ సిరిసిల్ల జిల్లా జూన్ 12:రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో ఫ్లెడ్ లైట్స్ వెలుగులతో ఏర్పాటు చేసిన టెన్నిస్ కోర్ట్ ను జిల్లా ఎస్పీ అధికారులతో కలిసి బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పని చేస్తున్న అధికారుల సిబ్బంది సంక్షేమనికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అధికారులు , సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటానికి ఈ టెన్నిస్ కోర్టు అందుబాటులోకి తీసుకరావడం జరిగిందని అన్నారు. నిత్యం శాంతి భద్రతల పరిరక్షణలో బిజీగా ఉండే సిబ్బందికి క్రీడలు మానసిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయన్నారు. పోలీస్ అధికారులు , సిబ్బంది వారి పిల్లల కోసం ఫ్లెడ్ లైట్స్ ల వెలుగులతో అందుబాటులోకి తీసుకవచ్చిన అత్యాధునిక టెన్నిస్ కోర్టు ని సద్వినియోగం చేసుకోవలని అన్నారు.క్రీడలు మనలో దాగున్న శక్తి సామర్థ్యాలను, పోరాట పటిమను వెలికి తీస్తాయన్నారు. పోలీసులు ఈదే స్ఫూర్తిని ప్రొఫెషన్ లోనూ చూపించాలి అన్నారు. పోలీసులు విధుల్లో ఒత్తిడి నుంచి బయటపడడానికి క్రీడలు తోడ్పడతాయని, శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఫ్లెడ్ లైట్స్ ల వెలుగులతో అత్యాధునిక టెన్నిస్ కోర్టు అందుబాటులోకి తీసుకవచ్చిన జిల్లా ఎస్పీ కి అధికారులు సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి,ఆర్.ఐ లు మాధుకర్, యాదగిరి, రమేష్, సి.ఐ రఘుపతి, పాల్గొన్నారు.

## పాఠ్య పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ.. బడిబాట షురూ



వాయిస్ టుడే న్యూస్ సిరిసిల్ల జిల్లా జూన్ 12: బడిబాట కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల నెహ్రూ నగర్, గీతా నగర్ పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాలకు జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి,డి ఆర్ డి ఓ శేషాద్రి, డీఈఓ రమేష్ కుమార్ హాజరై విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు బుధవారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు.ఈ కార్యక్రమాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రుక్మిణి, పాఠశాలల హెచ్ఎంలు భాగ్య రేఖ, శారద, సెక్టోరియల్ ఆఫీసర్ సతీష్ కుమార్ , మండల విద్యాధికారి దూస రఘుపతి , ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకేనపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పునప్రారంభం



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి జూన్ 12 2024 (వాయిస్ టుడే) : బెల్లంపల్లి మండలంలోని ఆకేనపల్లి గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వేసవి సెలవులను ముగించుకొని ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం పాఠశాలను ప్రారంభించారు. పాఠశాల ఆవరణంలో రంగురంగుల ముగ్గులు వేసి పచ్చని తోరణాలతో అలంకరించి విద్యార్థులకు నుదుట బొట్టు పెట్టి అక్షంతలు జల్లి పువ్వుల గుత్తులు చేతికి అందజేసి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఘనంగా స్వాగతం అలికారు. ప్రభుత్వ బడిలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పించినటువంటి ఉచిత పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫార్మ్ పిల్లలకు అందజేశారు. అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లిదండ్రుల సమావేశం కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల యొక్క తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి ప్రభుత్వ పాఠశాల యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలతో నైతిక విలువలను విద్యార్థులకు తెలియజేసేలా ప్రభుత్వ బడిలో నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయులు బోధన చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. పిల్లల యొక్క నడవడికలను తల్లిదండ్రుల సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు తెలుసుకున్నారు . ఈ కార్యక్రమంలో ఆకేనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జేరిపోతుల రాజేశ్వరి, ఉపాధ్యాయులు కే జ్యోతి, ఎల్ సుధారాణి, అంగన్ వాడి టీచర్స్ సత్యమ్మ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# మరోసారి అలరించేందుకు సిద్ధమైన 'ధమాకా' జోడి..

'ధమాకా'తో సందడి చేసిన రవితేజ-శ్రీలీల జోడి ఇప్పుడు మరోసారి రిపీట్ కానుంది. రవితేజ హీరోగా కొత్త దర్శకుడు భాను భోగవరపు ఓ సినిమాను తెరకెక్కించనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. RT75'తో అది ప్రచారంలో ఉంది. ఈ సినిమా పూజా కార్యక్రమాలతో మొదలైంది. శ్రీలీల క్లాప్ కొట్టి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. రవితేజ నటిస్తున్న 75వ సినిమా కావడంతో ఈ సినిమా ఆయనకు ప్రత్యేకం కానుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాను ప్రకటించినప్పుడే దీని గురించి రవితేజ పోస్ట్ పెడుతూ 'ధూమ్ ధామ్ దావత్' గ్యారంటీ అని పేర్కొన్నారు. దీంతో ఇందులో ఆయన మరోసారి మాస్ మహారాజ్‌లా కనిపిస్తారా అని అభిమానులు అనుకుంటున్నారు. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్న భాను భోగవరపు గతంలో చిరంజీవి హీరోగా వచ్చిన 'వాల్తేరు వీరయ్య'కు మాటల రచయితగా పని చేశారు. ఈ మూవీకి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. దీనితో పాటు రవితేజ.. గోపిచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. వీళ్లిద్దరి కాంబోలో రానున్న నాలుగో చిత్రమిది.





# నా కెరీర్‌లోనే బెస్ట్ సినిమా ఇది..

కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'భారతీయుడు 2'. వీళ్లిద్దరి కాంబినేషన్‌లోనే వచ్చిన హిట్ సినిమా 'భారతీయుడు'కు సీక్వెల్‌గా ఇది రానుంది. ఇందులో రకుల్ ప్రీత్ సింగ్ కీలకపాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన పాత్ర గురించి తెలిపారు. 'నా కెరీర్‌లోనే 'ఇండియన్-2' బెస్ట్ సినిమా అవుతుంది. ఇందులో నా పాత్ర అంత గొప్పగా ఉంటుంది. నా నిజ జీవితానికి దగ్గర పోలిక ఉంది. ఎంతో ఆత్మవిశ్వాసం ఉన్న మహిళగా కనిపిస్తాను. ఇప్పటి వరకు ఇలాంటి పాత్రలో నటించలేదు. ఈ సినిమా షూటింగ్ మొత్తం గొప్ప అనుభూతినిచ్చింది. శంకర్ వంటి అగ్ర దర్శకులతో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా విశేషాలను మీతో పంచుకోవాలని చాలా ఆసక్తిగా ఉంది. దానికి ఇంకా సమయం పడుతుంది' అని తెలిపారు.

# సెన్సార్ పనులు పూర్తి చేసుకున్న సుధీర్‌బాబు 'హరోంహర'



టాలీవుడ్ యువ కథానాయకుడు సుధీర్‌బాబు ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం 'హరోంహర'. 'ది రివోల్ట్' అనేది ఉపశీర్షిక. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ సినిమాకు జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహిస్తుండగా.. మాళవికా శర్మ కథానాయికగా నటిస్తుంది. సుమంత్ జి.నాయుడు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా జూన్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన టీజర్‌తో పాటు ట్రైలర్‌లు యూట్యూబ్‌లో రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతున్నాయి. అయితే విడుదలకు ఇంకా రెండు రోజులే ఉండటంతో తాజాగా సెన్సార్ పనులు పూర్తి చేసుకున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. సెన్సార్ బోర్డ్ సభ్యులు ఈ సినిమాకు ఏ సర్టిఫికెట్ జారీ చేసినట్లు తెలిపింది.

# వాస్తవాలు తెలుసుకోండి..

## సినిమా రైట్స్ ట్వీట్‌పై విష్వక్



విష్వక్ సేన్ హీరోగా దర్శకుడు రవితేజ ముళ్లపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. ఈ సినిమా పంపిణీ హక్కుల గురించి ఒకరు ఎక్స్ (ఇంతకుముందు ట్విటర్) వేదికగా పోస్ట్ పెట్టగా విష్వక్ స్పందించారు. 'మెకానిక్ రాకీ' రైట్స్‌ను ఇంకా విక్రయించలేదని, వాస్తవాలు తెలుసుకోండంటూ రిప్లై ఇచ్చారు. ఏమైందంటే?

ఈ చిత్రానికి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ రైట్స్ (ఆలిండియా)ను సొంతం చేసుకున్నట్టు ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ సోషల్ మీడియా వేదికగా మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు ఓ పోస్టర్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు కలిపి రూ. 8 కోట్లకు ఈ సినిమా పంపిణీ హక్కులను ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ కొనుగోలు చేసిందంటూ సదరు వ్యక్తి ట్వీట్ చేయగా విష్వక్ రియాక్ట్ అయ్యారు. హక్కులు పొందామని ఆ సంస్థ ప్రకటించినప్పటికీ విష్వక్ విక్రయించలేదనడంతో ఆయన అభిమానులు, సినీ ప్రియుల్లో సందిగ్ధత నెలకొంది. 'ఇదో కొత్తరకం ప్రచారం' అని కొందరు నెటిజన్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. విష్వక్‌కు ఇది 10వ చిత్రం. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు.



# జ్ఞానం కావాలంటే ప్రపంచంలో వెతకాలి

సమంత వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదించడం కోసం ఎక్కువగా టూర్‌లకు, ఆశ్రమాలకు వెళు_ంటారు. అలా వెళ్లినప్పుడల్లా వాటికి సంబంధించిన ఫొటోలను, అక్కడి అనుభవాలను అభిమానులతో పంచుకుంటుంటారు. అలాగే ఆమె సమయం దొరికినప్పుడల్లా కోయంబత్తూరులోని ఈషా ఫౌండేషన్‌కు వెళ్లి అక్కడ ధ్యానం చేస్తుంటారు. గతేడాది సామ్ అక్కడికి వెళ్లిన సంగతి తెలిసిందే. ఆ ఫొటోలను తాజాగా మరోసారి పంచుకున్నారు. 'గురువు, మెంటార్ కోసం మనలో చాలామంది వెతుకుతుంటారు. మన జీవితంలో వెలుగులు నింపి.. మనల్ని సరైన మార్గంలో నడిపించే వ్యక్తిని కనుగొనడానికి మించిన ప్రత్యేకమైనది మరొకటి ఉండదు. జ్ఞానం కావాలంటే ప్రపంచంలో వెతకాలి. ఎందుకంటే మన రోజువారీ జీవితంలో అనేక సంఘటనలు మనపై ప్రభావితం చూపుతుంటాయి. వాటిలో ఏవి సాధారణం, ఏవి అసాధారణమో తెలుసుకోవడం చాలా కష్టం. అలాంటి వాటి గురించి కేవలం తెలుసుకోవడమే కాదు.. మనం నేర్చుకున్న జ్ఞానాన్ని జీవితంలో అమలుచేయడం కూడా ముఖ్యమే' అని రాసుకొచ్చారు.

# చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు శుభాకాంక్షలు తెలిపిన చిరంజీవి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఏపీ నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుతో పాటు ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ ప్రమాణస్వీకారం చేశారు. ఇక మంత్రిగా పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడంతో రాజకీయ ప్రముఖులతో పాటు సినీ ప్రముఖులు జనసేనానికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే సినీనటుడు చిరంజీవి ఎక్స్ వేదికగా చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపాడు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగో సారి ప్రమాణస్వీకారం చేసిన నారా చంద్రబాబునాయుడు గారికి, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ గారికి, మిగతా మంత్రి వర్గానికి హార్దిక శుభాకాంక్షలు. ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధి కి అహర్నిశం పాటుపడే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను.ఆశిస్తున్నాను.!! అంటూ చిరు రాసుకోచ్చాడు.

# కల నెరవేరడానికి చాలా సమయం పట్టింది: నాగ్ అశ్విన్





కల నెరవేరడానికి చాలా సమయం పట్టిందన్నారు దర్శకుడు నాగ్ అశ్విన్ . ఆయన దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'కల్కి 2898 ఏడీ' . జూన్ 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ విశేషమైన ప్రేక్షకాదరణ దక్కించుకొని లక్షల వ్యూస్‌తో ట్రెండింగ్‌లో ఉంది. దీనిపై దర్శకుడు మాట్లాడుతూ.. ఎమోషనల్‌గా ఉందన్నారు. 'ఈ ట్రైలర్ రిలీజ్ అయిన సందర్భంగా నా మనసు భావోద్వేగానికి గురవుతుంది. పురాణాలు, సైన్స్ రెండింటిపై నాకు ఆసక్తి ఎక్కువ. ఈ రెండింటిని కలిపి సినిమా తీయాలని ఎన్నో ఏళ్ల క్రితం అనుకున్నాను. మా ఆర్టిస్టులందరి సాయంతో మైథాలజీకి సైన్స్‌ను జోడించి 'కల్కి 2898 ఏడీ' తెరకెక్కించాను. టీమ్ అద్భుతమైన ప్రతిభ, అంకిత భావం వల్లే ఇది సాధ్యమైంది. నా కలని సాకారం చేసుకోవడానికి చాలా సమయం పట్టింది. చిత్రబృందమంతా ఎంతో కష్టపడి పని చేసింది. తెలుగు ప్రేక్షకులతో పాటు. దేశంలోని వారంతా దీన్ని చూసి గర్వపడతారు' అని నాగ్ అశ్విన్ తెలిపారు.